ENTERED
KSR02B131C

అనగనగా ఒక రాణి

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జులై 31, 2016



చలో రియో



నాథన్ జోన్స్


చియా-హుయి లీయు


బ్రాండన్ రౌత్

హాలీవుడ్ 2 బాలీవుడ్

త్వరలో విడుదల కానున్న బాలీవుడ్ చిత్రాలు 'ఫీవర్', 'ఫ్లయింగ్ జాట్'లకు ఓ ప్రత్యేకత ఉంది. వీటిలో హాలీవుడ్ తారలు నటిస్తున్నారు. జేమ్స్‌బాండ్ హీరోయిన్ కేథరినా మురినోతోపాటు 'నైట్ ఆఫ్ ది లివింగ్ డెడ్' తార గెమ్మా ఎట్కిన్సన్ 'ఫీవర్'లో, యాక్షన్ స్టార్, రెజ్లర్ అయిన నాథన్ జోన్స్ 'ఫ్లయింగ్ జాట్'లలో ప్రముఖ పాత్రలు పోషించనున్నారు. మన దేశీ చిత్రాల్లో హాలీవుడ్ నటులనగానే బెన్ కింగ్స్లే గుర్తొచ్చేస్తాడు. ఇక్కడి చిత్రాల్లో నటించడమే కాదు ఏకంగా ఆయన గాంధీ పాత్రలో నటించి ఆస్కార్ కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత 'లగాన్'లో రేచెల్ షెల్లీ మెప్పించింది. 'మంగళ్ పాండే'లో టోబీ స్టీఫెన్ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నాడు. 'కంబక్త్ ఇష్క్'లో చాలామందే నటించేశారు. 'సూపర్‌మేన్ రిటర్న్స్' హీరో బ్రాండన్ రౌత్, 'రాంబో' సిల్వెస్టర్ స్టాలోన్, బాండ్ గర్ల్ డెనీస్ రిచర్డ్స్‌తోపాటు వూపీ గోల్డ్‌బెర్గ్, హోలీ వాలెన్స్‌లు ఆ చిత్రంలో తళుక్కుమన్నారు. 'ఏంజెల్' స్టార్ షరా థామ్సన్ 'రాజనీతి'లో కీలక పాత్రలో జీవించారు. అవకాశం వస్తే హృతిక్‌తో కలిసి ఓ సినిమా చేస్తానంటూ మనసులోని మాట బైట పెట్టారు పాప్ స్టార్ ప్యారిస్ హిల్టన్, 'ట్విలైట్' స్టార్ క్రిస్టినా స్టీవార్ట్స్. అంతకు ముందే బార్బరా మోరీ 'కైట్స్'లో హృతిక్‌కు జోడీగా నటించింది. యాక్షన్ థ్రిల్లర్‌లలో మేటి నటుడైన చియా-హుయి లీయు 'చాందినీ చౌక్ టు చైనా'లో పాత్ర పోషించారు. హాలీవుడ్ దిగ్గజాలు డేనియల్ రాడ్‌క్లిఫ్, షారోన్ స్టోన్, జూలియా రాబర్ట్స్, బ్రాడ్‌పిట్, జాకీచాన్‌లు భారతీయ చిత్రాల్లో నటించాలనే కాంక్షను బయటపెట్టారు.

కేథరినా

రేచెల్ షెల్లీ

బార్బరా మోరీ

KSR02B131
ENTERED

కరానా కథ

రాబిన్‌సన్ క్రూసో కథ చదివే ఉంటారు. ఓడ మునిగి ఓ ద్వీపం ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓ నావికుడి నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఆ కథ రాశారని అంటారు. అలాంటి మరో కథ కూడా ఉంది. అది 'ఐలాండ్ ఆఫ్ బ్లూ డాల్ఫిన్స్'. కరన అనే ఓ రెడ్ ఇండియన్ మహిళ సాన్ నికొలస్ దీవిలో 18 ఏళ్ల పాటు ఒంటరిగా జీవించింది. ఆ దీవి మీదుగా వెళుతున్న ఓ నౌక సిబ్బంది ఆమెను గుర్తించి అమెరికాకు చేర్చారు. సాహసోపేతమైన ఆమె కథ మనిషి మనుగడ పోరాటానికి నిదర్శనం. ఆమె తెగకు కలిగిన పరిస్థితి మనిషి రాక్షసత్వానికి సాక్ష్యం.

కాలిఫోర్నియా కోస్తాకు సమీపంలోని చానెల్ ద్వీప సముదాయంలో సాన్ నికొలస్ దీవి ఒకటి. శుష్కంగా, రాళ్లతో నిండి ఉంటుందా ప్రదేశం. అలా ఉంటుందనే ఇక్కడే అమెరికా అణు బాంబు పరీక్షలు కూడా నిర్వహించింది. ఇలాంటి చోట కరానా మనగలిగింది. ఇది 1800 నాటి యదార్థ కథ. అలాస్కా సీ వోట్టర్ క్షీరదాల వేటగాళ్లు, జంతు చర్మ వర్తకులు చానెల్ ద్వీప సముదాయంలో వేట ఎక్కువగా సాగించేవారు. శుష్కమైన నికొలస్ దీవుల్లోకి మాత్రం ప్రవేశించేవారు కాదు. అనువైన ప్రదేశం కాదని అటుగా వెళ్లేవారు కాదు. కానీ అక్కడ 10 వేల ఏళ్లుగా ఓ ఆదిమ తెగ మనుగడ సాగిస్తోంది. తర్వాత నికొలెనోలుగా పిలవబడిన వారు అనుకోకుండా ఈ సముద్ర వేటగాళ్ల కంట పడ్డారు. స్థావరం కోసమో, ఆ ప్రాంతంపై ఆధిపత్యం కోసమో వర్తకులు నికొలెనోలను ఊచకోత కోశారు. ఆడవాళ్లను అత్యాచారం చేసి సముద్రంలోకి విసిరేశారు. అంత దారుణం నుంచి కొంతమంది తప్పించుకుని పక్క దీవులకు పారిపోయారు. వర్తకులు స్థావరాల్ని ఖాళీ చేసిన కొన్ని రోజులకు విషయం తెలుసుకున్న ఫ్రాన్సిస్కన్ ఫ్రియర్ సాధువులు కెప్టెన్ చార్లెస్ హుబ్బర్డ్ సారథ్యంలో నౌకతో దీవికి వెళ్లి ఎవరన్నా ప్రాణాలతో మిగిలున్నారేమోనని వెదికారు. వివిధ మత శాఖల మిషనరీలు ఆదిమ తెగల్ని బలవంతంగా మత మార్పిడి చేయించడం, నాగరికతలోకి తెచ్చే ప్రాజెక్ట్‌లు ఎక్కువగా ఉన్న కాలమది. ఆ మిషనరీలు కొందరి జాడ కనుగొని మెయిన్‌ల్యాండ్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. అలానే కరన కూడా ఆ పడవలో చేరింది. ఇక్కడ రెండు కథనాలున్నాయి. అందర్నీ పడవ ఎక్కించాక లెక్క చూస్తే ఒక తల్లీబిడ్డ కనిపించలేదని

తెలిసిందని ఒక వాదన... తన రెండేళ్ల బిడ్డ నౌకలో కనిపించకపోవడంతో కదులుతున్న నౌకలోంచి సముద్రంలోకి ఓ మహిళ దూకి దీవికి చేరుకుందని రెండో వాదన. 18 ఏళ్ల తర్వాత అటుగా వెళ్లిన నావికులకు ఆమె కనిపించింది. ఆ నౌక కెప్టెన్ జార్జ్ నిడెవెర్ ఆ ప్రాంతం గురించి, అంతకు ముందు అక్కడ జరిగిన దాడి గురించి విని ఉన్నాడు. అందుకే ఆమెను కాపాడాలని నిర్ణయించుకున్నాడు. కార్మోరాంట్‌లనే సముద్ర పక్షుల ఈకలను వొంటికి ధరించి ఆమె వారికి తారసపడింది. ఆమె గూడు తిమింగలం దవడ, ఎముకలతో కట్టుకున్న చిన్న గుడిసెలాంటి నిర్మాణం. సీల్స్‌ని, సముద్ర బాతుల్ని వేటాడి ఆహారం సంపాదించుకునేది కరానా. ఆమె బిడ్డను అడవి కుక్కలు చెండాడాయనే చేదు నిజం తెలిసింది. వాటితో పోరాడిన ఆమె బిడ్డ ప్రాణాన్ని దక్కించుకోలేకపోయిందని కెప్టెన్ జార్జ్ నిడెవర్‌కు సైగలతో వివరించింది. ఆమె దినచర్య ఎలా ఉండేదో, వేట ఎలా చేసేదో చూపించింది. అమెరికాకు తీసుకొచ్చాక యువానా మరియాగా ఆమెకు పేరు పెట్టారు. అది 1853వ సంవత్సరం. సాంటా బార్బరాకు ఆమెను చేర్చాక తోటి తెగల వారి కోసం వెతగ్గా ఆచూకీ లభించలేదు. ఆధునిక మనిషి సాంగత్యం వల్ల మిగతా తెగల్లానే అంటు రోగాలు, మహమ్మారుల వల్ల చనిపోయింటారని భావించారు. అన్నేళ్ల పాటు ఎలా మనగలిందనే లోతైన వివరాల్ని తెలుసుకోడానికి సాధ్యపడలేదు. ఆమె మాట్లాడే భాష వారికి అర్థం కాలేదు. నికొలెనోలతో పరిచయమున్న చుమాష్ తెగల వారి ద్వారా కొన్ని విషయాల్ని రాబట్టగలిగారు. సాన్ నికొలస్ దీవికి దగ్గరలోని సాంటా కాటాలినా దీవికి చెందిన టోంగ్వా తెగలవారి సాయం తీసుకున్నా ఆమె మాట్లాడే భాష అర్థం కాలేదు. ఒంటరిగా ఉండటం వల్ల కూడా ఆమె భాషా సామర్థ్యంలో తేడా వచ్చి ఉంటుందని కొందరి వాదన. కానీ గీతాలాపన ద్వారా ఒంటరితనం నుంచి బయటపడింది. ఆ పాటలు, ఆలాపనలు నావికుల్ని ఆకట్టుకున్నాయి. కానీ సాంటా బార్బరాలోకి అడుగిడిన తర్వాత దీవి జీవితం కన్నా కష్టమైపోయింది కరానాకు. అప్పటికే ఆ ప్రాంతంలో పనికి తెచ్చిన ఆదిమ తెగలవారివి 3997 మరణాలు రికార్డు అయ్యాయి. ఈలోగా గోల్డ్ రష్ శకం మొదలై అనేక జాతులు, వర్తకులు, నేపథ్యాల వారి సంగమమైందా ప్రాంతం. ఓ నగర వాతావరణానికి చేరే సరికి కరానా అలవాటు పడలేకపోయింది. మద్యానికి బానిసైంది. కరానా గుర్రాల్ని ఎక్కువ ఇష్టపడేదని, సాన్ నికొలస్ దీవిని గుర్తు తెచ్చే గవ్వల్ని ఎప్పుడూ దగ్గర ఉంచుకునేదని కథనాలు వెలువడ్డాయి. కాఫీ ప్రియురాలు కూడా అయ్యింది. కానీ నగర జీవితం ఆమె చావును వెంటనే తెచ్చింది. ఏడు వారాలకే యువానా మరియా లేదా కరానా చనిపోయింది. ఓ రకంగా రెస్క్యూ మిషనే ఆమె ప్రాణాలు తీసిందనొచ్చు. అలాగే దీవిలో వదిలేస్తే ఇంకొన్నేళ్లు హాయిగా బతికేదేమో. హాయిగా అని ఎందుకు అనగలుగుతున్నామంటే ఆమె పాటలు అంత మధురంగా ఉండేవట. ఆమె సొంతంగా తయారుచేసుకున్న వస్తువుల ఆధారంగా ఆమె మనుగడ మీద అనేక పరిశోధనలు జరిగాయి. కానీ ఆమెలా అన్నేళ్లు నెగ్గుకొచ్చిందో తెలుసుకోవడం సాధ్యపడలేదు. ఆమె జీవిత కథ ఆధారంగా 1960లో స్కాట్ ఒ'డెల్ 'ది ఐలాండ్ ఆఫ్ బ్లూ డాల్ఫిన్స్' పుస్తకం రాశారు. ఆ కథలోనే ఆమె పాత్రకు కరానా అని పేరు పెట్టారు. అదే ప్రామాణికంలోకి వచ్చింది కానీ ఆమె అసలు పేరు మాత్రం తెలీదు.

- జే

18.12.2022

ఇండెక్స్

స్టార్.................3
అనగనగా ఒక రాణి

వివరం..............4
మంచం నాగలి...!

కార్టూన్ పంచ్......... 5

వింత లోకం..........10
డిగ్రీ లేని గణితవేత్త

కొత్త పుస్తకాలు........11
వర్తమాన పోరాట గాథ

కవిత్వమ్...............14
అలా చూడు ప్రపంచం

చలో రియో

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12
ఒక ప్రశ్న యాత్ర

ప్రత్యేకం...................15
నానమ్మల బడి

తెలుసా 16
లిక్విడ్ గోల్డ్

కథ......................17
వన మహా...ఉత్సవం

రుచి......................21
కేరళ చేపల కూర

బాల నేస్తాలు............23
బటన్ ఆర్ట్
పద వికాసం.....
....24

గత స్మృతులు

అద్దేపల్లి శర్వాణి గారు రాసిన వివరాణాత్మకమైన అట్టమీది కథ పేపర్...పేపర్. వ్యాసం చాలా బాగుంది. ఈ వ్యాసాన్ని చదువుతుంటే గతంలోని 'ప్రాతఃకాలాన లోకాన్ని?!' అనే నా కవిత గుర్తుకు వస్తుంది.

– సూర్య కుమార్, చింతలపూడి

ఘోరమైన నేరం

దేశ విదేశాల్లో అత్యున్నతులైన అబ్దుల్ కలాం, మార్టిన్ లూథర్ కింగ్, డిస్నీ సోదరులు, బఫెట్, నటుడు టామ్ క్రూస్ వంటి ప్రముఖులు రోజు వారి సంపాదన కోసం పేపర్ బాయ్స్‌గా పనిచేయడం ఆశ్చర్యపరిచింది. అండమాన్ అడవుల్లో గిరిజనులు నేటికి ఆధునిక ప్రపంచంపై కన్నెత్తి చూడకపోవడం కలవరపెడుతుంది.దళితులు ఆలయాల్లోకి ప్రవేశించడం, ప్రసాదాన్ని తాకడం అపవిత్రం అని వూరి పెద్దలు హుకుం జారిచేయడం దారుణమైన వివక్ష. దీన్ని సవాలుగా తీసుకుని దళిత్ ఫుడ్స్ పేరిట పొరుగు రాష్ట్రాలకు విస్తరించడం శుభపరిణామం.

– టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

స్త్రీ సమానత్వం

స్త్రీ కూడా ఒక మనిషే. తను కూడా శ్రమిస్తుంది. కాని జేబు ఉండదు. పుట్టింటి వాళ్ళు ఇచ్చిన స్త్రీధనం కూడా మగవాళ్ళ జేబుల్లోకి వెళ్లాలి. శ్రీశ్రీ చెప్పినట్లు స్త్రీ శ్రమకు ఖరీదు కట్టే షరాబులేడు. కత్తి పద్మారావు గారి కవిత చాలా బాగుంది.సాహసం చేయాలనుకున్నవారు వారికి నచ్చిన దారి వెతుకుతుంటారు.సచిన్ బండారి కూడా అలానే చేశాడు. సవాళ్ళను ఎదుర్కోని సాహసించినవాడు సాహసవంతుడు బారెన్ దీవి గురించి చాలా చక్కగా వివరించారు.

డెడ్‌విల్ అందాలు బాగున్నాయి. ప్రకృతి అందాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటాయి. అల్లికల వీధుల్లో కళలు, కలలు బాగున్నాయి.

– బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాల వలస

ఆకట్టుకున్న అండమాన్

అందమైన అడవులు, చల్లని సముద్ర తీరాలతోపాటు చారిత్రాత్మక స్వాతంత్ర్య పోరాట ఘట్టాలకు నిలయమైన అండమాన్ దీవుల విశేషాలు, టూర్ కయ్యే ఖర్చు, ప్రయాణ మార్గాలకి సంబంధించిన విషయాలు ఆకట్టుకున్నాయి. లధక్ ప్రాంతంలో ఐస్ హాకీని క్రికెట్ కంటే ఎక్కువగా ఆదరించడం అద్భుతం. స్థానిక క్రీడాకారులు చేస్తున్న కృషి అభినందనీయం. పిహెచ్‌డి తర్వాత యువత పెద్ద ఉద్యోగాల కోసం పరుగుతీస్తున్న నేటి పరిస్థితుల్లో ప్రీతి వ్యవసాయం చేస్తాననడం హర్షనీయం. ప్రముఖ రాజకీయ వేత్తలు, హాలీవుడ్ స్టార్‌లు, రచయితలు, క్రీడాకారులు చిన్న తనంలో పేపర్ బాయిస్‌గా పనిచేయడం ఆశ్చర్యపరిచింది.

– ఎన్.స్రవంతి, తిరుపతి

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

అనగనగా ఒక రాణి

'రాజారాణి' చిత్రాన్ని దక్షిణాదిన చాలామందే చూసి ఉంటారు. ఆ చిత్రంలో నాలుగు ప్రధాన పాత్రలు అలా గుర్తుండి పోతాయి. ఇద్దరు రాజులు, ఇద్దరు రాణులు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతారు. అందులో ఒక రాణే నజ్రియా నజీమ్. చిలిపిగా, అమాయకంగా, సున్నిత మనస్కురాలిగానే కాదు అనాథ బతుకులోని ఒంటరితనాన్ని కూర్చుకున్న బరువైన పాత్ర కీర్తనగా ఆమె భావోద్వేగాల్ని పలికించి మంచి నటి అనిపించుకుంది. ఆ ఒక్క చిత్రమే కాదు మిగతా చిత్రాల్లోను గొప్ప పాత్రలు చేసి ప్రతిభ చాటుకుంది.

- కొప్పుశెట్టి దేవరాజు

నజ్రియా నజీమ్ ఎక్కువగా తమిళం, మళయాల చిత్రాల్లో కథానాయికగా నటిస్తోంది.

- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ) నుంచి నజ్రియా కుటుంబం తిరువనంతపురం వచ్చి స్థిరపడింది.
- పాఠశాల విద్య కొంత ఎమిరేట్స్‌లోను, మరికొంత త్రివేండ్రంలోనూ పూర్తయింది. ప్రస్తుతం బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేస్తున్న నజ్రియా షూటింగ్‌ల బిజీతో చదువు చక్కగా సాగడం లేదు.
- తొలుత బుల్లి తెరపై యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. 2005 వరకూ ఇలా టీవీ యాంకర్‌గా చేస్తూనే సినిమాల్లో అవకాశాల కోసం ఎదురుచూసింది.
- 2006లో మలయాళంలో తీసిన 'పలుంకు' సినిమాలో బాలనటిగా తొలి అవకాశం దక్కింది. ఇందులో మమ్ముట్టికి కూతురుగా చేసి మెప్పించింది. తర్వాత మరో నాలుగేళ్ల పాటు నజ్రియా యాంకర్‌గానే కొనసాగించింది.
- ఏసియానెట్ మ్యూజిక్ చానల్ యాంకర్‌గా మారింది. ఆ టీవీలో రియాల్టీ షో 'స్టార్ సింగర్' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించింది. ఒక పక్క యాంకర్‌గా చేస్తూనే మరో రెండు చిత్రాల్లో బాల నటిగా నటించింది.
- ఆ తర్వాత సోనీ మ్యూజిక్ నిర్మించిన 'యువ్వ్' పాప్ ఆల్బమ్‌లో నటించింది. ఈ ఆల్బమ్‌కు యూట్యూబ్‌లో నాలుగు రోజులకు రెండు లక్షల హిట్స్ రావడం విశేషం.
- 2013 ఆమెకు మర్చిపోలేని బ్రేక్‌నిచ్చింది. ఎందుకంటే ఆమె హీరోయిన్‌గా కెరీర్‌ను ఈ ఏడాదే ప్రారంభించింది. 'యువ్వ్' ఆల్బమ్‌లో నటించిన లాల్, మేఘన రాజ్, లాలు అలెక్స్, పద్మ ప్రియా, పూజా గాంధీ తదితరులంతా ఈ చిత్రంలో నటించారు. ఆ సినిమాయే 'మ్యాడ్ డాడ్'. అందులో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి.
- కామెడీ థ్రిల్లర్ 'నీరమ్'లో కథానాయికగా చేయడం అవకాశాల్ని పెంచింది. ఈ చిత్రం తమిళ్, మలయాళ భాషల్లో రూపొందింది.
- తమిళంలో ఇదే సినిమాకు గాను ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు లభించింది. ఎడిషన్ అవార్డుల్లో కూడా డెబ్యూ(తొలి పరిచయం) ఉత్తమ నటిగా, విజయ అవార్డుల్లో కూడా బెస్ట్ డెబ్యూ పురస్కారం వరించింది.
- అదే ఏడాది ఓ గొప్ప చిత్రంలో నటించే అవకాశం దక్కింది. తెలుగువారికి పరిచయమైంది. నయనతార, ఆర్య, జైలతో కలిసి 'రాజారాణి'లో నటించింది. ఈ చిత్రంలో కీలకమైన పాత్ర పోషించి నటనతో అందర్నీ మెప్పించింది.
- ఓ కీలక సన్నివేశంలో కంటి కదలికలతోనే వెనువెంటనే భావోద్వేగాల్ని మార్చుకుని నటించిన ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆ సినిమా తర్వాత వెంటనే ధనుష్ సరసన 'నయ్యాండి'లో నటించే అవకాశం వచ్చింది.
- 2014లో 'సలలా మొబైల్స్' సినిమాలో చేసింది. దుల్కర్ సల్మాన్ ఇందులో కథానాయకుడు.
- మలయాళంలోనే 'ఓమ్ శాంతి ఓషాన' చిత్రంలో నటించింది. ఈ చిత్రంలో నటనకు కేరళ రాష్ట్రం అందించే ఉత్తమ నటి అవార్డు, ఏసియానెట్ టీవీ అందించే మోస్ట్ పాపులర్ నటి పురస్కారం లభించాయి. మలయాళం చిత్రసీమలో ఇది అతి పెద్ద హిట్ చిత్రంగా రికార్డులకెక్కింది.
- 'బెంగుళూరు డేస్' చిత్రంలో కూడా ఆమె చేసిన పాత్రకు ప్రశంసలు లభించాయి. ఈ సినిమాలో ఆమె నటనకు కేరళ స్టేట్, వనిత ఫిల్మ్ అవార్డుల్లో ఉత్తమ నటిగా పురస్కారాలు లభించాయి.
- 'సలలా మొబైల్స్' చిత్రంలోని 'ల ల లస...' బెంగుళూరు డేస్ సినిమాలో 'ఇంతే కన్నిల్ నిన్క్కయి...' అనే పాటలను పాడింది.
- తనతో కలిసి నటించిన ఫాహద్ ఫాసిల్‌నే 2014లో పెళ్లి చేసుకుంది.

మంచం నాగలి...!


విటోబా

మహారాష్ట్ర జల్‌గావ్‌లోని కడ్కి బద్రుక్ గ్రామానికి చెందిన విట్టల్ హరి మన్డోల్ (విటోబా) రైతుకూలీగా పనిచేస్తున్నాడు. ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలుగా మగ్గుతున్నా తన కుటుంబంలో మార్పు తేవాలనుకున్నాడు విటోబా. ఇతరుల పొలంలో పనిచేయడం మానేసి మూడెకరాల భూమిని కౌలుకి తీసుకుని ఎనిమిదేళ్ల నుంచి తనే సొంతగా వ్యవసాయం ప్రారంభించాడు. పొలం పనుల్లో తన భార్య సులభ సాయపడేది. తన ఇద్దరు పిల్లలు సంతోష్ , రాహుల్‌లని చదివించుకుంటూ సంవత్సరానికి 25 వేలు కౌలు చెల్లించేవాడు. ఓ సాధారణ కౌలురైతుగా లాక్కొస్తున్న విటోబా జీవితంలో అప్పుడే పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. తన పెద్ద కొడుకు సంతోష్ అనారోగ్యం కారణంగా ఎనిమిదో తరగతిలోనే చదువు మానుకున్నాడు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సంతోష్‌కి సరైన వైద్యం అందక పోవడంతో పెద్ద ఆపరేషన్ చేయాల్సొచ్చింది. అప్పటి వరకు తన వద్ద ఉన్న డబ్బంతా వైద్యం కోసం ఖర్చయిపోవడంతో విటోబా అధిక వడ్డీకి 2 లక్షలు అప్పు చేశాడు. గ్రామంలో అప్పుడే కరువు పరిస్థితులు చుట్టుముట్టడంతో పంట చేతికి రాక అప్పుతీర్చడం కష్టమైందతనికి. ఇలాంటి పరిస్థితుల్లోనూ విటోబా వ్యవసాయం మానుకోవాలనుకోలేదు. పొలం దున్నేందుకు ఎడ్లను కొనడానికి 70 వేలు అవసరమౌతాయి. రోజు కూలికి ఇవ్వాల్సిన 200 కూడా ఇవ్వలేని పరిస్థితిలో తన భార్య సులభ సాయంతో రాత్రింబవళ్లూ పొలం పనిలో కష్టించాడు. ఆ సంవత్సరం రెండు క్వింటాళ్ల పత్తి పండడంతో వచ్చిన డబ్బులు కౌలు చెల్లించడానికే సరిపోయాయి. వర్షాలు పడకపోవడంతో పాటు భార్యకి తీవ్ర అనారోగ్యం కారణంగా మరుసటి సంవత్సరం తన కష్టాలు రెట్టింపయ్యాయి. కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్న కొడుకు రాహుల్ కూడా బడికి వెళ్లడం మానుకోవాల్సొచ్చింది. బ్యాంకు రుణం కోసం ప్రయత్నించినా సొంత భూమి కాకపోవడంతో రుణం ఇవ్వడం సాధ్య పడదని అధికారులు చెప్పడంతో వెనుదిరిగాడు. పొలం దున్నేందుకు ఈ సారి విటోబా వద్ద నాగలి కూడా లేదు. ఎడ్లను అద్దెకు తీసుకొచ్చినా వాటికి కనీసం చెల్లించాల్సిన 500 రూపాయలు కూడా లేకపోవడంతో ఏంచేయాలో తెలీక ఇంటి ముఖం పట్టాడు. మరునాడు ఉదయాన్నే పొలానికి చేరుకుని

ఆరుగాలం శ్రమించే రైతుకి సమయానికి పంట చేతికి రాకపోతే వణుకు పుడుతుంది. కష్టాలు ఎదుర్కొనే ధైర్యం ఉన్నా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నాగలి, ఎద్దును అద్దెకు తీసుకోవడం కూడా కష్టమైంది జలగావ్‌లోని ఓ రైతుకి. అలాంటి దుర్భర పరిస్థితుల్లో మూడెకరాల భూమిని ఒంటరిగా ఓ మంచం సాయంతో దున్నే సాహసం చేశాడతడు. నులక మంచమే నాగలి... భుజమే ఎద్దుల మోపు. భూమిలోకి కుంగిపోయేలా చేస్తున్న ఇంటి బాధ్యతల భారానికి మంచం కాలిని తన్ను పెట్టాడీ ఒక్క రైతు.

భూమిని పరిశీలుస్తుండగా ఓ మూల, రాత్రి సమయంలో తను పడుకునే నులక మంచం కనిపించిందతనికి. అప్పుడే తనకో ఆలోచన తట్టింది. వెంటనే ఒక చివర బరువైన రాళ్లను కట్టి మంచం కోళ్ళతో పొలం దున్నటం ప్రారంభించాడు విటోబా. సాయంత్రం ఎనిమిది గంటలకి భూమి దున్నడం పూర్తయింది. మరుసటి రోజు తీవ్ర వళ్లు నెప్పులతో బాధపడినా రుతుపవనాలు ప్రవేశించే సమయానికి నాట్లకి పొలం సిద్ధం చేసుకోగలగడం తనకెంతో ఆనందాన్నిచ్చిందంటాడు విటోబా. మంచం కోళ్లతో విటోబా పొలం దున్నిన విషయం గ్రామంలో ప్రచారమవ్వడంతో తను ఉపయోగించిన పద్ధతి తెలుసుకునేందుకు ఎంతో మంది రైతులు ఆయనని కలిసి తన పొలాన్ని సందర్శించారు. తీవ్రమైన పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకుండా కష్టాన్ని నమ్ముకుని ముందడుగేసిన విటోబా ఇప్పుడా గ్రామంలో రైతులందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాడు.

ప్రముఖ దిన పత్రికల ద్వారా ఆయన గురించి తెలుసుకున్న పూణెకి చెందిన శివప్రభ . స్వచ్ఛంద సంస్థ అతనికి సాయం చేసేందుకు ముందుకొచ్చింది. పొలం పని కోసం ఒక జత ఎడ్లని అందించాలనుకున్నా కడ్కి బద్రుక్ గ్రామంలో ఎడ్ల ఖరీదు అధికంగా ఉండటంతో స్వచ్ఛంద సంస్థ సభ్యులు నాందేడ్ నుంచి మేలైన ఎడ్లని కొని విటోబాకి అందించారు. విటోబా స్ఫూర్తితో మరి కొందరు పేద రైతులు తమ పొలంలోనూ నులక మంచం పట్టారు.

✦

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

పార్కింగ్

కన్న తన ఆటోకున్న మూడు చక్రాల్లో ఓ చక్రాన్ని ఊడదీస్తూ చిన్నాకు కనిపించాడు.

చిన్నా: ఒరేయ్ కన్నా! ఎందుకు టైరు తీస్తున్నావ్? పంక్చరయ్యిందా?

కన్నా: లేదురా చిన్నా! ఇక్కడ 'టూ వీలర్ పార్కింగ్ మాత్రమే' అని రాసి ఉందని.

చిన్నా: వోయ్...!

ఆటో...బైక్

"నాన్నా...నేను ఇంటర్ పాసైతే మంచి బైక్ కొనివ్వాలి..!

అడిగాడు కొడుకు.

"ఓకే..ఓకే..ఒకవేళ ..ఫెయిలైతే మాత్రం మంచి ఆటో కొనిస్తాను సరేనా..! చెప్పాడు తండ్రి.

అమ్మను మాట్లాడుతున్నాను..

చిన్నీ! ఈ రోజు స్కూల్‌కి రాదండీ..! స్కూల్‌లో మోగిన ఫోన్ అందుకుంది హెడ్‌మిస్.

"ఇంతకీ ఎవరు మాట్లేడేది."

"నేనూ..! మా అమ్మను మాట్లాడుతున్నాను."

ట్యాక్సీ

ముగ్గురు తాగుబోతులు ఓ ట్యాక్సీ ఎక్కారు. అది కనిపెట్టిన డ్రైవర్ కారు ఇంజిన్‌ను స్టార్ట్ చేసి కాసేపటికి ఆపేసి మీ ఇల్లొచ్చేసిందని చెప్పాడు.

మొదటి తాగుబోతు డబ్బులిచ్చాడు. రెండో తాగుబోతు 'థ్యాంక్స్' చెప్పాడు. మూడో తాగుబోతు డ్రైవర్ చెంప వాయించాడు. మూడోవాడికి తను చేసింది తెలిసిపోయిందని డ్రైవర్ క్షమాపణ చెప్పే సమయానికి 'మెల్లగా డ్రైవ్ చేయాలని తెలీదా! కొంచెం ఉంటే నీ స్పీడుకి కారు బోల్తా కొట్టేది.' అని హెచ్చరించి వెళ్లాడు.

హలో రియో

ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడల పండుగ ఒలింపిక్స్‌కు బ్రెజిల్ వాణిజ్య రాజధాని రియో డిజెనీరో సకల హంగులతో ముస్తాబయ్యింది. ఆగస్టు 5 నుంచి 21 వరకు జరిగే ఈ మహా సంబరానికి అమెజాన్ గడ్డ తొలిసారిగా ఆతిథ్యమిస్తోంది. రెండు వారాల పాటు జరిగే ఈ ప్రపంచ క్రీడా సమరంలో 206 దేశాలకు చెందిన 7 వేల 500 మంది అథ్లెట్లు 28 క్రీడల్లో 2488 పతకాల కోసం ఢీ కొంటున్నారు.

- చొప్పరపు కృష్ణారావు
8498084018

ఒలింపిక్స్ నాలుగు సంవత్సరాలకోసారి జరిగే ప్రపంచ క్రీడల పండుగ. ఈ భూ ఖండంలోని 206 దేశాల క్రీడాకారులను 700 కోట్ల జనాభాను ఏకతాటి మీదకు తీసుకువచ్చే ఒకే ఒక్క వేదిక. గత 12 దశాబ్దాలుగా వివిధ ఖండాల మధ్య తిరుగుతూ వస్తున్న ఆధునిక ఒలింపిక్స్ క్రీడలకు ఘన చరిత్ర ఉంది. సామ్రాజ్యవాదం, వర్ణ వివక్ష, తీవ్రవాదం, కక్షలు, కార్పణ్యాలు వంటి అవలక్షణాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నేటి తరానికి ఉపశమనం కలిగించడానికి ఫ్రెంచ్ వ్యాపారవేత్త దార్శనికుడు బారెన్ పియరీ డీ కొబెర్టిన్ కనిపెట్టిన దివ్యౌషధం ఒలింపిక్స్.

ఏథెన్స్ టు రియో...

మానవ జాతి హాయిగా జీవించడానికి ఎన్నో రకాల సదుపాయాలు మాత్రమే కాదు..ఉపాయాలను సైతం కనిపెట్టింది. వివిధ ఖండాలు, ప్రాంతాల వారీగా విడిపోయిన మనుషుల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలను శాంతిని పెంపొందించడానికి క్రీడలను మించిన మార్గం మరొకటి లేదని గ్రహించిన బారెన్ పియరీ డీ కొబెర్టిన్ క్రీస్తు పూర్వం 7వ శతాబ్దకాలంలో జరిగిన పురాతన ఒలింపిక్స్‌కు ఆధునిక రూపాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. కృషి, పట్టుదల, అంకితభావంతో శ్రమించి ఆధునిక ఒలింపిక్స్‌కు ఊపిరిపోశారు. గ్రీస్ రాజధాని ఏథెన్స్ లోని ఒలింపియా వేదికగా 1896లో ప్రారంభమైన ఆధునిక ఒలింపిక్స్..గత 120 సంవత్సరాల కాలంలో అంతై ఇంతై అంతింతై అన్నట్లుగా ఎదిగిపోయాయి. యూరోప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా ఖండాలను పలుమార్లు చుట్టివచ్చి చివరకు దక్షిణ అమెరికా ఖండ దేశం బ్రెజిల్ చేరుకొంది. ప్రపంచానికే ఊపిరితిత్తులుగా పేరుపొందిన అమెజాన్ అటవీ ప్రాంతం 2016 ఒలింపిక్స్‌కు వేదికగా ఎంపికయ్యింది.

77 వేల 237 కోట్ల రూపాయల ఖర్చు

లాటిన్ అమెరికా దేశాల పెద్దన్న బ్రెజిల్ మొట్టమొదటి సారిగా ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించే అవకాశం సంపాదించింది. షికాగో, మాడ్రిడ్, టోక్యో నగరాలతో పోటీ పడి మరీ విజేతగా నిలిచింది. బ్రెజిల్ వాణిజ్య రాజధాని రియో డి జెనీరో వేదికగా ఆగష్టు 5 నుంచి 17 వరకూ 12 రోజుల పాటు జరిగే ఈ క్రీడా సంరంభం కోసం... 77 వేల 237 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా 206 దేశాలకు చెందిన 10 వేల 500 మంది అథ్లెట్లు , అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొనే ఈ క్రీడల కోసం అత్యాధునిక హంగులతో ఏర్పాట్లు చేసింది. క్రీడా గ్రామంతో పాటు స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో నిర్మించిన వివిధ క్రీడా వేదికలను సిద్ధం చేసింది. మరో ప్రత్యేకత ఏమిటంటే ఈ సారి ఒలింపిక్ పతాకం కింద శరణార్థుల జట్టు కూడా ఒలింపిక్స్‌లో పాల్గొంటోంది. జట్టులో సభ్యులు వివిధ దేశాలనుంచి శరణార్థులుగా శిబిరాలకు చేరిన వారే. సిరియా, సూడాన్ వంటి కల్లోలిత దేశాల నుంచి తమ కుటుంబాల భవిష్యత్తు కోసం

ప్రాణాలు దక్కించుకునేందుకు శరణార్థులుగా మారిన వీరిలో అద్భుత ప్రతిభా పాటవాలకు కొదవ లేదు. వీరిని గుర్తించి ఒలింపిక్ కమిటీ క్రీడ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వడం మంచి పరిణామం.

గ్రామం అంటే... గ్రామం కాదు..



ఆధునిక ఒలింపిక్స్ చరిత్రలోనే అతిపెద్ద క్రీడా గ్రామాన్ని బ్రెజిల్ ఒలింపిక్స్ సంఘం 5 వేల 624 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించింది. 31 ఆకాశ హర్మ్యాలు, 3604 బహుళ గదుల నివాసాలను ఏర్పాటు చేసింది. క్రీడా గ్రామంలో రెండు వారాల పాటు నివాసం ఉండే 18 వేల మంది అతిథుల కోసం.... షాపింగ్ మాల్స్, ఆరోగ్య కేంద్రాలు, బ్యాంకులు, తపాలా కేంద్రాలు, వ్యాయామశాలలు, ఈత కొలనులు, ఉద్యానవనాలను తీర్చిదిద్దారు. క్రీడా గ్రామంలో నివాసం ఉండే అథ్లెట్లు, అధికారులకు వివిధ రకాల సేవలు అందించడం కోసం 13 వేల మంది వలంటీర్లను నియమించారు. వీరు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొన్నారు.

మొత్తం 17 అంతస్తులతో 31 భవనాలను నిర్మించారు. ఈ భవన సముదాయం దాదాపు రెండు కిలోమీటర్ల మేర విస్తరించింది. మొత్తం 31 భవనాలలో 19 వేల పడకలతో పాటు 3 వేల 604 బహుళ గదుల గృహాలను ఏసీ సదుపాయలతో నిర్మించారు. మత సాంప్రదాయాలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రార్థనాలయాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో నివాసం ఉండే అథ్లెట్లు 43 శాతం మంది కేవలం 10 నిమిషాలలో, 57 శాతం మంది 25 నిమిషాలలో ప్రధాన వేదికలు చేరేలా 400 వోల్వో బస్సులను అందుబాటులో ఉంచారు. ఈ బస్సులన్నీ 24 గంటలూ క్రీడా గ్రామంలో తిరుగుతూనే ఉంటాయి.

రోజుకు 60 వేల భోజనాలు

క్రీడా గ్రామంలో అతిపెద్ద భోజనశాలను ఏర్పాటు చేశారు. ఇది బోయింగ్ 747 జంబో జెట్ విమానం పట్టేంత పెద్దగా ఉంటుంది. ఏక కాలంలో 5 వేల మంది కూర్చుని భోజనం చేసే సౌకర్యం ఉంది. 120 సంవత్సరాల ఒలింపిక్స్ చరిత్రలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన ఒలింపిక్ క్రీడా గ్రామంగా రియో ఒలింపిక్స్ విలేజ్ ఇప్పటికే రికార్డుల్లో చోటు సంపాదించింది.

28 క్రీడలు-812 స్వర్ణ పతకాలు

ఒలింపిక్స్ కోసం రియో డీ జెనీరోలోని నాలుగు జిల్లాల్లో 28 రకాల క్రీడల కోసం 37 వేదికలను సిద్ధం చేశారు. ఫుట్‌బాల్‌ను మాత్రమే రియోతోపాటు రియో వెలుపలి నగరాలలో నిర్వహించబోతున్నారు. 1924 తర్వాత రగ్బీ క్రీడ సరికొత్త రూపంలో తిరిగి ప్రవేశం చేయబోతోంది. 15 మంది సభ్యుల పోటీలకు బదులుగా ఏడుగురు సభ్యులు మాత్రమే ఉండే రగ్బీ సెవెన్స్‌ను తొలిసారిగా నిర్వహించబోతున్నారు. అంతేకాదు 112 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి గోల్ఫ్ క్రీడను ఒలింపిక్స్ ప్రధాన అంశాలలో ఒకటిగా నిర్వహించబోతున్నారు. మొత్తం 28 రకాల క్రీడల్లోని 42 విభాగాలు 306 అంశాలలో విజేతలుగా నిలిచిన అథ్లెట్ల కోసం 812 బంగారు పతకాలతో సహా మొత్తం 2 వేల 488 పతకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో 812 రజత, 864 కాంస్య పతకాలు సైతం ఉన్నాయి.

బంగారు ఆశలతో భారత బృందం

ప్రపంచ క్రీడల పండుగ ఒలింపిక్స్ చరిత్రలో భారత్ కు అతిపెద్ద అధ్యాయమే ఉంది. 1920 ఆమ్‌స్టర్‌డామ్ గేమ్స్ నుంచి ఒలింపిక్స్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటూ వచ్చిన భారత్ పరిస్థితి పతకాల సాధనలో అంతంత మాత్రంగానే ఉంది. జాతీయ క్రీడ హాకీలో మాత్రమే అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు సాధించిన అరుదైన రికార్డు భారత్‌కు మాత్రమే ఉంది.

జనాభా పరంగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్ జనసంఖ్యకు తగ్గ స్థాయిలో ఒలింపిక్స్‌లో రాణించలేకపోతోంది. నాలుగేళ్ళ క్రితం ముగిసిన లండన్ ఒలింపిక్స్‌లో 83 సభ్యుల బృందంతో 13 క్రీడాంశాలలో పోటీకి దిగిన భారత్ రెండు రజత, నాలుగు కాంస్య పతకాలతో పతకాల పట్టికలో 55వ స్థానంలో నిలిచింది. ఫ్రీస్టయిల్ కుస్తీలో సుశీల్ కుమార్ పిస్టల్ షూటింగ్‌లో విజయ్ కుమార్ రజత పతకాలు సాధించగా.. మహిళల బాక్సింగ్‌లో మేరీకోమ్, బ్యాడ్మింటన్ సింగిల్స్ సైనా నెహ్వాల్, కుస్తీలో యోగేశ్వర్‌దత్, షూటింగ్‌లో గగన్ నారంగ్ కాంస్య పతకాలు సంపాదించారు. మొత్తం ఆరు పతకాలతో భారత్ మొదటి యాభై స్థానాలలో సైతం చోటు సంపాదించలేకపోయింది. అయితే

బ్రెజిల్ సమస్యలు ఫుల్

రియో ఒలింపిక్స్ ప్రారంభానికి ముందే ఆతిథ్య బ్రెజిల్‌ను పలురకాల సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ పోటీలలో పాల్గొనటానికి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే 206 దేశాల అథ్లెట్లు అధికారులు టూరిస్టులకు భద్రత కల్పించడం, జికా వైరస్ బారిన పడకుండా కాపాడటం, ఆర్థిక సమస్యలు బ్రెజిల్ ఒలింపిక్ సంఘానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఆగష్టు 5 నుంచి 21 వరకూ జరిగే ఈ ప్రపంచ క్రీడల సంబరానికి బ్రెజిల్ ప్రభుత్వం ఒలింపిక్ సంఘం కలిసి. ఇప్పటికే 74వేల కోట్ల రూపాయల ఖర్చు చేశాయి. పోటీలు ముగిసేనాటికి ఇది మరింత పెరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు. ప్రపంచ కప్ ఫుట్ బాల్ నిర్వహణ తలకు మించిన భారమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో భారీగా ఖర్చు చేసే కార్యక్రమాలు అంటే భారీ అవినీతి అని దానికి బ్రెజిల్ సైతం ఏ మాత్రం మినహాయింపు కాదని అంటున్నారు. ఒలింపిక్స్ ఆ తర్వాత జరిగే పారా ఒలింపిక్స్ నిర్వహణతో బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థ కుదేలవటం ఖాయమని లాటిన్ అమెరికా ఆర్థిక వేత్తలు జోస్యం చెబుతున్నారు.

భద్రతా వ్యవస్థకు పరీక్ష..

1972 మ్యూనిక్ ఒలింపిక్స్ నుంచి భద్రతా ఏర్పాట్లకు ప్రాధాన్యమిస్తున్నారు. ఒలింపిక్స్ నిర్వహించడం ఒక ఎత్తయితే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం మరో ఎత్తని గత మూడు దశాబ్దాల కాలంలో ఈ క్రీడలకు ఆతిథ్యమిచ్చిన దేశాల అనుభవాలే చెబుతున్నాయి, బ్రెజిల్ వాణిజ్య రాజధాని రియో లోని మూడు జిల్లాలలోని డజను పైగా వేదికల్లో జరిగే క్రీడల కోసం..88 వేల మంది పోలీసులు, సాయుధ దళాల సిబ్బందిని నియమించారు. వీరికి తోడ్పాటు అందించడానికి 55 దేశాలకు చెందిన 250 మంది భద్రతా నిపుణులు పోలీసు అధికారులు తరలి వస్తున్నారు. ప్రపంచంలోనే క్రైమ్ రేటు ఎక్కువగా ఉండే నగరాలలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్న రియోలో 18 వేల మంది సైనిక దళాలతో గస్తీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో మూడు పతకాలు మాత్రమే గెలుచుకున్న భారత్... లండన్ ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను ఆరుకు పెంచుకోవడం గుడ్డిలో మెల్లగా చెప్పుకోవాలి.

ఇక ప్రస్తుత రియో ఒలింపిక్స్ 121 మంది సభ్యుల భారీ బృందంతో భారత్ పతకాల వేటకు సిద్ధమైంది. 15 క్రీడలు, 66 అంశాలలో భారత అథ్లెట్లు తమ అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

వీరిలో 67 మంది పురుషుల, 54 మంది మహిళలు ఉన్నారు.

ఇద్దరూ ఇద్దరే...

రియో ఒలింపిక్స్ పాల్గొంటున్న భారత అథ్లెట్లలో టెన్నిస్ పేస్ లియాండర్ పేస్, మహిళల 100 మీటర్ల స్ప్రింటర్ ద్యుతీ చంద్ అరుదైన రికార్డులతో బరిలోకి దిగబోతున్నారు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బొపన్న జంటగా లియాండర్ పేస్ పతకం వేటకు దిగబోతున్నాడు. పేస్ క్రీడా జీవితంలో రియో ఒలింపిక్స్ వరుసగా ఏడో గేమ్స్ కావడం విశేషం. 1996 అట్లాంటా ఒలింపిక్స్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించిన అరుదైన రికార్డు లియాండర్ పేస్‌కు మాత్రమే ఉంది.

2004 ఏథెన్స్ ఒలింపిక్స్ డబుల్స్‌లో మహేశ్ భూపతితో జంటగా నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల 100 మీటర్ల పరుగులో ఒరిస్సా కమ్ హైదరాబాదీ రన్నర్ ద్యుతీ చంద్ రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది.1980 మాస్కో ఒలింపిక్స్‌లో పీటీ ఉష పాల్గొన్న తర్వాత 100 మీటర్ల పరుగులో ఒలింపిక్స్ అర్హత సాధించిన ఘనత ద్యుతీకి మాత్రమే దక్కింది. 36 ఏళ్ల విరామం తర్వాత ద్యుతీ ద్వారా భారత్ ఒలింపిక్స్ బెర్త్ సంపాదించింది. మహిళల హాకీలో భారత జట్టు 36 ఏళ్ల విరామం తర్వాత ఒలింపిక్స్‌కు అర్హత సంపాదిస్తే..సర్దార్ సింగ్ నాయకత్వంలోని పురుషుల జట్టు ఏదో ఒక పతకం సాధించాలన్న పట్టుదలతో పోటీకి దిగుతోంది.



సైనా నెహ్వాల్

సానియా మీర్జా

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ సైనా నెహ్వాల్ పీవీ సింధు, డబుల్స్‌లో గుత్తా జ్వాలా-అశ్వనీ జోడీ, పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, పురుషుల డబుల్స్ మను అత్రి- సుమీత్ రెడ్డి జోడి తమ అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

మహిళల విలు విద్యలో దీపికా కుమారి, షూటింగ్‌లో అభినవ్ బింద్రా,విజయ్ కుమార్, కుస్తీలో యోగేశ్వర్ దత్ ఏదో ఒక పతకం సాధించగలమన్న ధీమాతో ఉన్నారు. గత ఒలింపిక్స్ లో సాధించిన ఆరు పతకాల లక్ష్యాన్ని రియో గేమ్స్‌లో అధిగమించగలమన్న ధీమా భారత బృందంలో కనిపిస్తోంది. అయితే అత్యున్నత ప్రమాణాలకు మరోపేరుగా నిలిచిపోయే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశమే గొప్పనుకొంటే ఏదో ఒక పతకం సాధించడం అంతకు మించిన గొప్పని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

ఒలింపిక్స్ - భారత్....

ఒలింపిక్స్ కు భారత్ అవినాభావ సంబంధమే ఉంది. 120 సంవత్సరాల ఆధునిక ఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు ప్రత్యేక అధ్యాయమే ఉంది. 1900 లో జరిగిన ప్యారిస్ ఒలింపిక్స్ నుంచి లండన్‌లో ముగిసిన 2012 ఒలింపిక్స్ వరకూ.... భారత్ మొత్తం 23 సార్లు ఒలింపిక్స్‌లో పాల్గొని తన ప్రత్యేకతను నిలుపుకొంది. ప్యారిస్‌లో ముగిసిన రెండవ ఆధునిక ఒలింపిక్స్‌లో భారత బృందం బ్రిటీష్

జికా...లకలకా..!

దక్షిణ అమెరికా ఖండంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న 2016 ఒలింపిక్స్‌ను వేల కోట్ల రూపాయల ఖర్చుతో ఓ వైపు బ్రెజిల్ ప్రభుత్వం నిర్వహిస్తుంటే అనుకోని అతిథిలా జికా వైరస్ తెర మీదకు వచ్చి నిర్వాహక సంఘం పెద్దలతో పాటు క్రీడల్లో పాల్గొనటానికి వచ్చే వివిధ దేశాల ప్రముఖుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.దోమకాటుతో వ్యాప్తి చెందే జికా వైరస్ బ్రెజిల్‌తో సహా మొత్తం 58 దేశాలలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే గుర్తించింది. జికా వైరస్ సోకిన వారితో అరక్షిత లైంగిక కార్యకలాపాలు నిర్వహించినా ఈ వైరస్ సంక్రమించే ప్రమాదం ఉంది ప్రధానంగా గర్భిణీ స్త్రీలకు జికా వైరస్ ముప్పు అంతా ఇంతా కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదడు సరిగా పెరగని పిల్లలు, చిన్న పరిమాణంలో తల ఉన్న పిల్లలు జికా వైరస్ ప్రభావంతో జన్మించే ప్రమాదం ఉందని తేల్చి చెప్పారు. ఇంత ప్రమాదకరమైన వైరస్ రియో నగరంలో కనిపించడంతో బ్రెజిల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దోమల నిర్మూలనకు ఏర్పాట్లు చేసింది.

జికా వైరస్ గురించి ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని....5 లక్షల మందిలో కేవలం పది నుంచి పదిహేను మందికి మాత్రమే సోకే అవకాశం ఉందని నిర్వహించిన అధ్యయనంలో తేలిందని సావో పాలో వైద్య విద్యాలయం పరిశోధకులు తేల్చి చెప్పారు.

ఒలింపిక్ విలేజ్‌తో పాటు క్రీడా వేదికల పరిసర ప్రాంతాలలో దోమల ఉనికే లేకుండా చర్యలు తీసుకొన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒలింపిక్స్ జరిగే 15 రోజులు రియో నగరానికి బ్రెజిల్ దేశానికి గర్భవతులు మాత్రమే దూరంగా ఉంటే చాలు.

ముగ్గురూ ముగ్గురే...

నాలుగేళ్లకు ఓ సారి జరిగే ఒలింపిక్స్‌లో ఒక్కసారి పాల్గొంటేనే జీవితం ధన్యమైనట్లు అథ్లెట్లు భావిస్తారు. అదే వరుసగా ఏడు సార్లు పాల్గొనే అవకాశం వస్తే అంతకు మించిన గొప్ప గౌరవం మరొకటి ఉండదు. అలాంటి అరుదైన అవకాశాన్ని మన ఇండియన్ ఎవర్ గ్రీన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ సొంతం చేసుకొన్నాడు.1992 ఒలింపిక్స్ ద్వారా అరంగ్రేటం చేసిన లియాండర్ పేస్ 1996, 2000, 2004, 2008, 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొనడం ద్వారా వరుసగా ఆరు గేమ్స్‌లో పాల్గొన్న అరుదైన ఆటగాడిగా నిలిచాడు. రియో ఒలింపిక్స్‌లో పాల్గొనడం ద్వారా వరుసగా ఏడు ఒలింపిక్స్‌లో పాల్గొన్న మొనగాడిగా రికార్డు సృష్టించాడు. ఇక 19వ బంగారు పతకానికి గురిపెట్టిన అమెరికన్ ఆల్‌టైమ్ గ్రేట్ స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ సైతం చరిత్ర సృష్టించడానికి సిద్ధమయ్యాడు. 30 ఏళ్ల వయసుకు ముందే నాలుగు వరుస ఒలింపిక్స్‌లో 18 స్వర్ణాలతో సహా మొత్తం 22 పతకాలు సాధించిన ఫెల్ప్స్ రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకొని మరీ రియో పూల్‌లోకి దిగుతున్నాడు. వరుసగా ఐదో ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించాడు. 2004 ఏథెన్స్ గేమ్స్ నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొంటూ వస్తున్న జమైకన్ థండర్, మానవ చిరుత ఉసేన్ బోల్ట్ వరుసగా నాలుగో ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించాడు. 100,200 మీటర్ల పరుగు అంశాలతో పాటు రిలే పరుగులో సైతం తన దేశానికి బంగారు పంట పండించాలన్న పట్టుదలతో ఉన్నాడు. రియో బరిలోకి వేల మంది అథ్లెట్లు బరిలోకి దిగుతున్నా టెన్నిస్ ఏస్ పేస్, స్విమ్మింగ్ సంచలనం ఫెల్ప్స్, స్ప్రింట్ థండర్ ఉసేన్ బోల్ట్ ముగ్గురూ ముగ్గురే అనడంలో ఏమాత్రం సందేహం లేదు.



పేస్

ఫెల్ప్స్

బోల్ట్

పతాకంతో ఆంగ్లేయ అథ్లెట్లు నార్మన్ ప్రీచర్డ్ నాయకత్వంలో అరంగేట్రం చేసింది. 200 మీటర్ల పరుగులో నార్మన్ భారత్‌కు రజత పతకం అందించాడు.

1904 నుంచి 1916 ఒలింపిక్స్‌కు దూరంగా ఉన్న భారత్.. యాంట్వార్ప్ వేదికగా 11920లో జరిగిన గేమ్స్‌కు ముగ్గురు అథ్లెట్ల బృందాన్ని పంపింది. భారత అథ్లెట్లు ఒక్క పతకమూ గెలుచుకోలేకపోయారు.1924 ప్యారిస్ ఒలింపిక్స్‌లో ఏడుగురు సభ్యుల బృందంతో భారత్ పోటీకి దిగినా ఉట్టి చేతులతో తిరిగి రావాల్సి వచ్చింది.

హాకీలో బంగారు కొండ..

1928 ఆమ్‌స్టర్ డామ్ ఒలింపిక్స్ హాకీలో తొలిసారిగా పాల్గొన్న భారత జట్టు.. 1956 మెల్బోర్న్ ఒలింపిక్స్ వరకూ బంగారు పతకాలు గెలుచుకొంటూ తనకు తానే సాటిగా నిలిచింది. ఫీల్డ్ హాకీకి మరోపేరుగా నిలిచింది. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది స్వర్ణ పతకాలు సాధించిన ఒకే ఒక్క దేశంగా ఈనాటికీ భారత్ నిలిచింది. ఒలింపిక్స్ చరిత్రలో భారత్ ఇప్పటి వరకూ సాధించిన తొమ్మిది బంగారు పతకాలలో హాకీ జట్టు అందించినవే ఎనిమిది పతకాలు ఉన్నాయి. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో చివరిసారిగా హాకీ స్వర్ణం సాధించిన భారత్ ఆ తర్వాత పాతాళానికి పడిపోయింది. కనీసం ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే కనాకష్టంగా మారిపోయింది. మొత్తం 23 సార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్ 17 గేమ్స్‌లో మాత్రమే ఏదో ఒక పతకం గెలుచుకొంటూ వచ్చింది. ఆరు గేమ్స్‌లో భారత్ అథ్లెట్లు శూన్య హస్తాలతో తిరిగి రావాల్సి వచ్చింది. 1900 ప్యారిస్ ఒలింపిక్స్ నుంచి 2012 లండన్ ఒలింపిక్స్ వరకూ భారత జట్లు, అథ్లెట్లు కలిసి మొత్తం 26 పతకాలు అందించారు. ఇందులో 9 బంగారు, 6 రజత, 11 కాంస్య పతకాలు ఉన్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో పతకాలు సాధించిన మొత్తం 136 దేశాల వరుసలో భారత్ 53వ స్థానంలో నిలిచింది.

వ్యక్తిగతంగా ఒకే ఒక్కటి...

బింద్రా

23 ఒలింపిక్స్ గేమ్స్‌లో భారత్ సాధించిన మొత్తం 26 పతకాలలో వ్యక్తిగతంగా భారత్ ఒకే ఒక్క బంగారు పతకం ఉందంటే ప్రపంచ క్రీడల్లో మన పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో భారత్ షూటర్ అభినవ్ బింద్రా సాధించిన స్వర్ణమే..నాటకీ నేటికీ ఓ రికార్డుగా నిలిచిపోయింది.

బీజింగ్ ఒలింపిక్స్‌లో 57 మంది అథ్లెట్ల బృందంతో పాల్గొన్న భారత్ మూడు పతకాలతో స్వదేశానికి తిరిగి వచ్చింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్య రికార్డు స్థాయిలో ఆరుకు పెరిగింది. మొత్తం 81 మంది అథ్లెట్లతో లండన్ బరిలోకి దిగిన భారత్ రెండు రజత, నాలుగు కాంస్య పతకాలు గెలుచుకొంది. అయినా పతకాల పట్టికలో భారత్ స్థానం 55 మాత్రమే. ప్రస్తుత రియో ఒలింపిక్స్‌లో మొత్తం 123 మంది అథ్లెట్లతో కూడిన భారీ బృందంతో భారత్ పోటీకి దిగుతోంది. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫీల్డ్ హాకీ, గోల్ఫ్, జిమ్నాస్టిక్స్, జూడో, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్,కుస్తీ అంశాలలో భారత్ అథ్లెట్లు సమరానికి సిద్ధమయ్యారు. 123 మంది సభ్యుల్లో 55 మంది మహిళలు 68 మంది పురుషులు ఉండటం విశేషం. ఇంత భారీ బృందంతో భారత్ పాల్గొనడం ఇదే మొదటిసారి.

మొత్తం 10 పతకాలు సాధించడమే లక్ష్యంగా రియోకి బయలు దేరిన భారత బృందానికి గోల్డెన్ షూటర్ అభినవ్ బింద్రా నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్స్ ప్రారంభ వేడుక కవాతులో పాల్గొనే భారత బృందానికి ముందు పతాకధారిగా అభినవ్ నిలువనున్నాడు.

జికా వైరస్‌ను, తీవ్రవాద ముప్పును,డోపింగ్ వివాదాలను అధిగమించి.... రియో ఒలింపిక్స్ ప్రశాంతంగా సరికొత్త ప్రపంచ రికార్డులతో ఒలింపిక్స్ స్ఫూర్తితో ముగియాలని కోరుకుందాం. చక్ దే భారత్, చక్ దే ఒలింపిక్స్.



నిప్పే ఎర.. నింపేయ్ వల

చేపలు పట్టడంలో తైవాన్ జాలర్లు నేర్పే వేరు. చేపలకు నిప్పును ఎరవేసి వలల్లోకి నింపుకుంటారు. జిన్షాన్ జిల్లాలోని సల్ఫర్ హార్బర్‌లో ఇప్పటికీ ఇలా చేపల్ని పట్టే కుటుంబాలు కేవలం మూడే ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం 300 పడవల్లో వేట సాగేది. గంధకం మట్టిని ఓ వెదురు బొంగుకు కట్టి మంట రాజేసి నీటిపై ఉంచుతారు. మండుతున్న గంధకం మట్టి నీటిలో కలిసినా చిన్న చిన్న రవ్వల్లా వెలుగును వెదజల్లుతుంది. దానికి ఆకర్షితమైన చేపలు పడవ మీదున్న మంటను అందుకునేందుకు నీటిలోంచి పైకెగురుతాయి. వాటిని అంతే నేర్పుగా వలల్లో పట్టేస్తారు జాలర్లు. ఆరు గంటల పాటు రాత్రుళ్లు సాగే ఈ వేటలో మూడు నుంచి ఆరు టన్నుల చేపల్ని పట్టేస్తారు. ప్రస్తుతం ఈ విద్య తెలిసిన వాళ్లంతా 60ల వయసు పైబడిన వారే. వారి తర్వాతి తరాలు క్రమంగా దీనికి దూరమవడంతో కొన్నేళ్లలో ఈ ప్రత్యేక వేటను చూడలేమని అంటున్నారు. అందుకే తైవాన్ ప్రభుత్వం దీన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. పర్యాటకులను ఆకట్టుకునేలా విధానాలు మారుస్తూ ఆదాయం పెంచుతోంది.

డిగ్రీ లేని గణితవేత్త

చైనాకు చెందిన యూ జియాన్‌చున్ ఓ పెద్ద గణిత చిక్కుముడికి తేలికైన పరిష్కారం కనుగొన్నాడు. డిగ్రీ కూడా చేయని 33 ఏళ్ల యూ డెలివరి బాయ్‌లా పనిచేస్తూనే కార్మైకేల్ సంఖ్యలపై లెక్కలేసేవాడు. స్యూడో ప్రైమ్ నంబర్లుగా పిలిచే ఈ భారీ సంఖ్యల్ని ఒకటి లేదా అదే సంఖ్యతో మాత్రమే విభజించగలం. వీటిని క్రెడిట్ కార్డు ఎన్‌క్రిప్షన్లకు, ఆన్‌లైన్ పేమెంట్‌లపుడు వాడతారు. వీటిని కనుక్కోవడం కొంచెం కష్టమే. తేలికైన పరిష్కారం కోసం ఖాళీ సమయాల్లో దాదాపు ఎనిమిదేళ్లుగా వాటికి సంబంధించిన గణితాన్ని నేర్చుకుంటూ వచ్చాడు. తాను కనుగొన్న కొత్త పద్ధతి గురించి అనేక విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసినా తొలుత ఎవరూ పట్టించుకోలేదు. మొన్నామధ్య జేజియాంగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కై టియాంక్సిన్ నుంచి ఆహ్వానం అందింది. గణితవేత్తల ముందు తన లెక్కను విప్పి కార్మైకేల్ సంఖ్యల తీరును విశ్లేషించే సరికి అందరూ అవాక్కయ్యారు.



మనోడి లెక్క తెలిసే సరికి పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగమిచ్చేందుకు ముందుకొచ్చాయి. కానీ కెరీర్ కన్నా ముందు జీవిత భాగస్వామి కోసం పరితపిస్తున్నాడు 'యూ'. పిల్ల దొరికాక కానీ కెరీర్‌పై ధ్యాస కుదరదట. ఆల్ ద బెస్ట్ 'యూ'. ఎందుకంటే కుటుంబం లెక్క సరై ధ్యాస కుదిరితే ఇంకెన్ని గణిత చిక్కుముడులు విప్పి విశ్వ కుటుంబానికి ఉపయోగపడతాడోనని!

వింత లోకం

పోకెమొన్ బీమా

పోకెమొన్ గేమ్ గురించి రచ్చ అంతా ఇంతా కాదు. అదింకా భారత్‌లోకి ప్రవేశించకుండానే చర్చోపచర్చలు చానెళ్లకెక్కేశాయి. ఈ వర్చువల్ రియాల్టీ వీడియో గేమ్ యువతను రోడ్లెంట పరుగులు తీయిస్తోంది. గుట్టలు, కొండలు ఎక్కిస్తోంది. నదులు, చెరువుల దగ్గరకు నడిపిస్తోంది. సంచలనమైన ఈ మొబైల్ గేమింగ్ యాప్ వల్ల ప్రమాదాలు చాలానే ఉన్నాయని మెల్లిమెల్లిగా తెలుస్తోంది. పోకెమొన్‌ను

పట్టుకోబోయి రైలు ఢీకొనడం, చెరువులో పడటం, కొండ మీది నుంచి జారడం, వరస కార్ల యాక్సిడెంట్ కావడం, కాల్పులు జరగడం వంటి అనేక దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అందుకే రష్యాలో స్బేర్ బ్యాంక్ ఆ గేమ్ ఆడేవాళ్లకు



సరికొత్త బీమా పథకాన్ని ప్రకటించింది. గేమ్ ఆడుతూ యాక్సిడెంట్‌లు అయితే అటుఇటుగా యాభై వేలు బీమాగా ఇస్తామని ధీమాగా ఆడుకొమ్మని అంటోంది.

వర్తమాన పోరాట గాథ

అవును, ఇది జరిగిన కథ కాదు. మన కళ్ల ముందు సాగుతున్న పోరాటం. వర్తమాన జీవన చిత్రాల్లో ఒక సంక్లిష్టత ఎప్పుడూ ఉంటుంది. పీడకులు, పీడితులు కనపడుతూనే ఉంటారు. అందులోనూ రాజ్యం, రాజ్యాంగ యంత్రాంగం సమిష్టిగా కొన్ని సమూహాలపై విరుచుకుపడితే, బాధితుల గొంతు వినిపించడం కూడా కష్టమే! వారి తరపున నిలిచిన వారిని, వారి హక్కుల కోసం ఎలుగెత్తే వారిని అణచివేయడానికే అధికారం ప్రయత్నిస్తుంది. బాధితుల కష్టాలను, కన్నీళ్లను, వారి భావోద్వేగాలను, పోరాటాలను తన నవలకు ఇతివృత్తంగా ఎంచుకున్నారు. అభివృద్ధి పేరుతో పాలకులు సృష్టిస్తున్న విధ్వంసాన్ని, అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను నిర్మొహమాటంగా ఎండగట్టారు. కథా గమనానికి ఏ మాత్రం ఆటంకం లేకుండా, ఏకబిగిన చదివించేలా కథనాన్ని నడిపిస్తూనే పోరాటానికి ఊపిరి ఊదడం ఈ రచన ప్రత్యేకత! 'మనం పోరాడాలి. మనిషి చచ్చిపోకూడదు. బ్రతకాలి. పోరాటానికై బతకాలి' అన్న వ్యాఖ్యలతో ఈ నవల ముగియడం పోరాట వారసత్వ విశిష్టతను చాటి చెబుతుంది. సముద్రానికి అరకిలోమీటరు దూరంలోనే ఉండే భైరవలంక రచయిత కథాస్థానం. 'తీరాన్ని చేర్చి ఒక పక్క సర్వే తోటలు,

కడలి కల్లోలం
వెల : 125 రూపాయలు
పేజీలు: 174
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

మరో పక్క మడ అడవి, మూడో పక్క గోదావరి వచ్చి కలుస్తుంది. పడమరవైపు పెద్ద ఉప్పు కాలువ ఉంటుంది. ఈ కాలవే బయట ఊళ్లతో సంబంధాన్ని విడదీసి, లంకలా ఉంచింది' అని భైరవలంక గురించి రచయిత చెబుతారు. ఈ వర్ణన చాలు కదా...అక్కడి ప్రకృతిని, పర్యావరణాన్ని, సముద్రంపై ఆధారపడి జీవిత సమరాన్ని సాగించే మత్స్యకారుల, చిన్నా చితక రైతుల జీవితాన్ని అర్థం చేసుకోవడానికి..! ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన సహజవాయువులు వెలికితీసే ఒక కంపెనీ కన్ను ఆ చిన్న లంకపై పడింది. ప్రభుత్వ అండా లభించింది. కార్పొరేట్ సంస్థలు విసిరే కాసులకు కక్కుర్తి పడే ప్రజా ప్రతినిధులు కొందరు ఏజెంట్లుగా మారారు. తమ వంధి మాగాధులను బ్రోకర్లుగా మార్చారు. కులం కార్డును వాడుతూ భైరవలంకపై విరుచుకుపడ్డారు. ఇదీ .. కథా నేపథ్యం! కన్నతల్లి వంటి సొంత ఊరును, ఇంతకాలం బతుకుకు భరోసా ఇచ్చిన వృత్తులను, పచ్చటి ప్రకృతిని వదులుకోవడానికి సిద్ధపడని మత్స్యకారులు, రైతులు ఈ ప్రయత్నాలను ప్రతిఘటించడమే సారాంశం! అధికారం ఊరుకుంటుందా? ఊరుకోదు. ప్రశ్నించే ప్రజలతో పాటు, వారికి మద్దతుగా నిలిచిన వారిపైనా విరుచుకుపడుతుంది. భైరవలంకలోనూ అదే జరిగింది. అయినా బాధిత జనం పోరాటం ఆగదు. పోరాట సంకల్పంతోనే నవల ముగుస్తుంది. 2015లో విశాఖపట్నంలో జరిగిన సిపిఎం 21వ మహాసభల సందర్భంగా నిర్వహించిన పోటీలలో తృతీయ బహుమతి పొందిన ఈ నవల పాఠకులను ఆలోచింపచేస్తుంది.

- వి.రాజగోపాల్

జీవం కలిగిన జీవిత కథలు

జీవితానుభవాల ఆవిష్కరణ, సన్నివేశాల వాస్తవిక నేపథ్యం, పఠనీయ శైలి వంటి విశేష లక్షణాలు గల 'కాన్పులదిబ్బ' కథా సంపుటిలో రచయిత చింతకింది శ్రీనివాసరావు ముద్ర ప్రస్ఫుటమవుతుంది. ఈ కథల్లోని పాత్రలను వర్ణించడంలో, వాటి అంతరంగ విశ్లేషణలో రచయిత తన ప్రతిభను కనబరిచారు. జీవం కలిగిన ఈ జీవిత కథల్లో పాత్రలు సగటు మనుషులకు దగ్గరగా ఉన్నాయి. 'కాన్పుల దిబ్బ' కథలో.. ఊళ్లో ఎవరు పురుడు పోసుకున్నా కాన్పులదిబ్బ మీదే. అలాంటి దానిపై ప్రాథమిక వైద్య కేంద్రం నిర్మించేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న చిట్టిబాబుకు అక్కడ పనులకొచ్చే బంగారమ్మను బలత్కరిస్తాడు. గ్రామస్తులు ఆరోగ్య కేంద్రాన్ని కూల్చుతారు. బంగారమ్మకు జరిగిన అన్యాయానికి అక్కడికొచ్చిన జిల్లా కలెక్టరు కూడా కన్నీటి పర్యంతం కావడం పాఠకుని హృదయానికి దగ్గరగా ఉంది. 'మేస్టుబాబు మరిలేరు' కథలో అందరికీ ఇష్టుడైన మాస్టారు (మేస్టుబాబు) రిటైరైన కొద్ది రోజులకే భార్య చనిపోగా.. కొడుకు, కోడలు వచ్చి తమ వెంట తీసుకెళ్తారు. అక్కడ



కాన్పుల దిబ్బ
రచయిత : చింతకింది శ్రీనివాసరావు
పేజీలు : 124/-
వెల : 110/-
ప్రతులకు : ప్రధాన పుస్తక కేంద్రాలు

అపార్టుమెంటులో ఆయనకు ఒంటరి జీవితం వల్ల మానసికంగా కుంగి మరణిస్తాడు. గ్రామ ప్రజల్లో మమేకమై తిరిగే మాస్టారు ఒంటరి జీవితాన్ని ఎంత నరకంగా అనుభవించారో ఈ కథ తెలియజేస్తుంది. 'పాదాలకు తగిలిన ప్రశ్నలు' అనే కథలో.. ఊళ్లో దుర్మార్గులని ఏమి చేయలేకపోతున్నాడనే ఆవేదనతో అపుడెపుడో ఎలుగుబంటిని చంపినపుడు.. దాంతో దిగిన ఫొటోని చించిపారేస్తాడు. జాన్ మాస్టారు అడిగిన వాటికి జవాబులేమిటనే ప్రశ్నల్లా ఆ ఫొటో ముక్కలు శిష్యుని కాళ్లకడ్డం పడడాన్ని ఆసక్తికరంగా మలిచారు. 'ఘోరం' అనే కథలో...'...అత్యాచారం జరిగిన ఆడ కూతుళ్లకు గవర్నమెంటు రూల్సు పేరుతో నానా రకాల దరిద్రపు పరీక్షలు చేసే వైద్యుల సూటిపోటి మాటల్తో మరో రేప్ జరుగుతోంది నాన్నా' అని వెంకటరత్నం అనే తొమ్మిదో తరగతి చదివే పద్నాలుగేళ్ల బాలిక ఆగ్రహంతో అనే మాటలు గుండెల్ని పిండేసేలా ఉన్నాయి. 'మైనం' కథలో..'డబ్బున్న వాళ్లున్నా మాఊరికి పేరు రాలేదు. చదువుకున్నోళ్లున్నా మా గ్రామానికి ఘనత రాలేదు. మేం వాయించే డప్పులు, బిళ్ల పందేల వల్లనే మా పల్లెకు పేరొచ్చింది' అని డప్పు కళాకారులు గొప్పగా చెప్పుకునేవారు. ఆ డప్పు పందెం ద్వారానే వారిని అణచి వేసేందుకు అగ్రకులాల వారు కుట్ర పన్ని వారిని ఓడిస్తారు. తరతరాలుగా దొరల కుతంత్రాలకు దళితులు ఎలా దగా పడుతున్నారో బట్టబయలు చేశారు. ఈ సంపుటిలో పది కథలున్నాయి. ఉత్తరాంధ్ర మాండలికం వీటిలో ప్రాణం పోసుకుంది. కొన్ని పదాలు ఇతర ప్రాంత పాఠకులకు కొరుకుడు పడవు.

- టి.డి.ప్రసాద్

ఒక ప్రశ్న యాత్ర

నిద్ర తర్వాత మెలకువ రావడం వేరు.. మరో రోజుకై మేలుకోవడం వేరు. చాలామంది మరో రోజు కోసం పరితపిస్తుంటారు. ఒక్కొక్కరిది ఒక్కో కారణం, అవసరం. లక్ష్యం, పోరాటం, బాధ్యత. అదే ప్రశ్నతో బ్యాక్‌ప్యాకర్ పోలండ్‌కి చెందిన అన్నా నాదియా బ్యాండురా ప్రపంచాన్ని చుడుతోంది. ఒక్కో ప్రాంతం, ఒక్కో సంస్కృతి. ఒక్కో జీవన విధానం నుంచి వచ్చిన వారికి అదే ప్రశ్న వేస్తూ వారి సమాధానాల్ని డాక్యుమెంట్ చేస్తోంది. ఇలా 17 నెలల్లో 5 ఖండాల్లోని 30 దేశాల్ని తిరిగింది. కలల్ని నిజం చేసుకోడానికి లేచేవారు కొందరు. సూర్యుడి తొలి కిరణాలు నేలని తాకుతున్నప్పుడు పక్షుల కిలకిల రావాలను వింటూ ప్రకృతిని ఆస్వాదించేవారు కొందరు ఆమెకు తారసపడ్డారు.

ప్రతి రోజూ మిమ్మల్ని మేలుకునేలా చేసేదేమిటి? (వాట్ మేక్స్ యూ వేక్‌అప్ ఎవ్రీ డే?) అనే ప్రశ్నలో చాలా లోతైన శోధన ఉంది. యాంత్రిక జీవనంలో కొట్టుకుపోయే వారికి అదేమంతా గొప్ప ప్రశ్నగా అనిపించదు. కానీ ఏదో విషయంలో తపించేవారికి, రగిలిపోయేవారికి మేలుకోవడమంటే చాలా పెద్ద విషయమే. అలాంటి వారి నుంచి వచ్చే సమాధానం అంతే స్ఫూర్తి రగిల్చేలా ఉంటుంది. వింతగా, అతిశయంగా అనిపించే ఆ ప్రశ్న అప్పుడు అర్థవంతంగా అనిపిస్తుంది. రోజు విలువ తెలుస్తుంది. అందుకే అన్నా నాదియా బ్యాండురా (25) ఆ ప్రశ్నతోనే ఒక ప్రపంచ యాత్రని మొదలెట్టింది. పోలండ్‌లో జర్నలిస్ట్‌గా కెరీర్‌ని ప్రారంభించిన నాదియా ఐదేళ్ల పాటు అదే వృత్తిలో కొనసాగి మీడియాలో దాదాపు అన్ని రంగాల్లో అనుభవం గడించింది. జర్నలిస్ట్ వృత్తిలో సహజంగా వివిధ విషయాల్ని రాబట్టాలంటే ప్రయాణం తప్పనిసరి. జర్నలిజంతో పాటు అంతర్జాతీయ సంబంధాలు అంశంలో డిగ్రీ పూర్తి చేయడంతో తన చుట్టూ ఉన్న సమాజంలో అనేకమందిని అర్థం చేసుకోవడం కూడా తేలికైంది. తనను మరో రోజుకై మేల్కొనేలా చేసేదేమిటని రెండేళ్ల క్రితం నాదియా మనసులో తలెత్తిన ప్రశ్న. అదే మిగతావారి విషయంలో ఏంటనే కుతూహలం మొదలైంది. 2013 జనవరిలో తన తొలి ప్రయాణం మొదలెట్టే ముందు అన్నా నాదియాకు ఆ ప్రశ్నకి స్పష్టత వచ్చింది. తాను ఉదయాన్నే మేల్కొనేది కొత్త విషయాల్ని తెలుసుకోడానికి. ప్రపంచ యాత్రలో

తొలి మజిలీ భారత్

ఇక్కడి పురాతన కట్టడాలు, ఆలయాలు, ప్రజల ఆచార వ్యవహారాలు నాదియాకి తెగ నచ్చేసాయి. తన ప్రశ్నకి మొదటి సమాధానం లభించినది కూడా ఇక్కడే. భారత్‌లో వివిధ మతాలకి చెందినవారు తమ రోజువారీ పనుల కంటే ముందు ధ్యానానికి ప్రాధాన్యతనిస్తారు. చాలా మంది ఉదయాన్నే లేచి ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని పాటిస్తుంటారు. ధ్యానం కోసమే ఉదయాన్నే నిద్రలేచే మన్‌దీప్ నుండి ఇలాంటి విషయాలెన్నిటినో తెలుసుకుంది నాదియా. అక్కడి నుండి తన ప్రయాణం నేపాల్ దిశగా సాగింది. పర్యాటక ప్రదేశంగా పేరొందిన నేపాల్‌లో రాజ్యాంగపరమైన మార్పుతో అక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని అందిపుచ్చుకున్నా ఇంకా రాచరిక ఛాయలూ నాదియాకి అక్కడక్కడా తారసపడ్డాయి. అయితే కొత్త ఆలోచనలతో ముందుకు దూసుకెళుతున్న నేపాలీ యువతని తన ప్రశ్నతోనే పలకరించింది నాదియా. 'వైద్యపరంగా మా గ్రామం కొంత వెనుకబాటులో ఉంది. అందుకే నేను పెద్ద డాక్టర్ అవ్వాలనుకుంటున్నాను. తల్లిదండ్రులు, కుంటుంబసభ్యులతో పాటు ఉదయం వేళలు తన కలని నిజం చేసుకునేందుకు ఎంతో



ప్రేరణనివ్వడంతో ఉదయాన్నే నిద్రలేచి చదువుకుంటాను' అంటూ తొమ్మిదో తరగతి చదువుతున్న కుంగ సమాధానమిచ్చింది. అక్కడి నుండి తన యాత్ర మలేషియా దిశగా సాగింది.

మలేషియా భాష విభేదాలు

మలేషియాలో 52 శాతం మలయ జాతీయులు నివసిస్తున్నారు. చైనీయులు 32 శాతంగా ఉంటే 8 శాతంగా ఉన్న హిందువులు అక్కడ మైనారిటీలు. ప్రభుత్వం అందించే వివిధ రాయితీలను అందుకుంటున్నా మలయా వారు ఆర్థికపరంగా వెనుకబడి ఉన్నారు. ఎన్నో దేశాల్లో వివిధ ప్రాంతాలకి చెందిన వారిని భాష కలిపితే ఇక్కడ మాత్రం భాషాపరమైన వివాదాలే ఎక్కువ. ప్రకృతి అందాలతో ఆకట్టుకునే మలేషియా పర్యాటకుల నిలయంగా మారడంతో ఈ దేశంలోకి అనేక భాషలు ప్రవేశించాయి. మలేషియాలోని టియోమెన్ ద్వీపంలో తనకి పరిచయమైంది మలాయ్ యువతి టమేజియమ్. ప్రయాణాలంటే ఇష్టపడే టమేజియమ్‌ని ఎందుకు నిద్ర లేస్తావంటూ ప్రశ్నించింది అన్నా నాదియా. ప్రకృతి అందాల్ని వీక్షించడం టమేజియమ్‌కి ఇష్టం. అందుకే మలేషియాలోని వివిధ దీవుల్ని చేరుకుంటూ వేకువజాము ప్రకృతి అందాల్ని తన కెమేరాలో బంధిస్తుంది టమేజియమ్. సముద్ర తీర ప్రాంతాలు, పచ్చని ఎత్తైన కొండలు, చిన్న చిన్న పాయల్లో ప్రవహించే స్వచ్ఛమైన నీరు, నోరూరించే థాయ్ వంటకాలు, నేషనల్ పార్కులు, అర్ధరాత్రి పున్నమి వెలుగుల్లో నైట్ పార్టీలు

థాయ్‌ల్యాండ్‌లో నాదియాని ఎంతో ఆకట్టుకున్నాయి. థాయ్‌ల్యాండ్‌లో తనకి పరిచయమైన వ్యక్తి షిందనాయ్. అతణ్ని ప్రశ్నిస్తే తన ప్రియురాలితో బ్రేకప్ అవడంతో కలవరపరిచే తన జ్ఞాపకాలే షిందనాయ్‌ని నిద్రలేపుతున్నాయని సమాధానం వచ్చింది. థాయ్‌ల్యాండ్ తర్వాత నదియా చేరుకున్న దేశం కంబోడియా. అక్కడి 'సెయిమ్ రీప్' ప్రాంతాన్ని అత్యధికంగా పర్యాటకులు దర్శిస్తుంటారు. కంబోడియాలోని ఆంగోర్కర్ వాట్ ఆలయం అతిపురాతన ఆలయంగానే కాకుండా ప్రపంచంలోకెల్లా మతపరమైన అతి పెద్ద స్మారకంగా పేరొందింది. వాటన్నిటినీ చుట్టబెట్టాక నాదియా కొలంబోలోని పురాతన కట్టడాలని చూసేందుకు మరి కొన్ని ప్రాంతాల్ని చేరుకుంది. కొలంబియాలోని టూరిస్ట్ ప్రదేశాల కంటే చిన్నారులకి పాఠాలు నేర్పిస్తూ కనిపించిన ఫై పనితీరు ఆమెని ఎక్కువగా ఆకట్టుకున్నాయి. అందుకే నాదియా తన ప్రశ్నతో ఫైని పలకరించింది. ఒకప్పుడు అందరిలాగే తనూ నిద్రలేచేవాడు. అయితే తమ దేశం విద్యావిధానాల్లో వెనుకబడి ఉంది. అందుకే చిన్నారులకు కొత్త విషయాలు పరిచయం చేయడం కోసం ఉదయాన్నే నిద్రలేస్తున్నాడు ఫై. తను రాజకీయాల్లోకి ప్రవేశించి తమ దేశంలో విద్యావిధానాలని మార్చడమే తన లక్ష్యమని చెప్పుకొచ్చాడతను. ఇండోనేషియా, కొలంబియా, థాయ్‌ల్యాండ్, మలేషియా, ఇండియా, నేపాల్‌లని చుట్టొచ్చి తన ఆసియా టూర్ ముగించుకుంది నాదియా.

గ్రిరావీన్స్ రాక్స్

ప్రపంచంలో ఇప్పటి వరకు తను చూడని ఎన్నో వింతల్ని చూడడానికి రెట్టింపైన ఉత్సాహంతో ఆస్ట్రేలియా చేరుకుంది నాదియా. గ్రిరావీన్ నేషనల్ పార్క్ ఆస్ట్రేలియాలో అతిపెద్ద వన్యప్రాణి సంరక్షణ కేంద్రం. ఒకప్పుడు ఆకాశం నుండి అధికంగా తోకచుక్కలు పడ్డ ప్రాంతంగా కూడా పేరొందిన ఈ ప్రదేశంలో క్రూరమృగాలతోపాటు వేల రకాల జంతువులు, పక్షుల్ని సందర్శించొచ్చు. అక్కడ జంతువులే కాదు వాటిని చూసేందుకు వెళ్లే దారులు కూడా భయానకంగా ఉంటాయి. పార్క్ ముఖ ద్వారంలో పిరమిడ్ ఆకారంలో సహజసిద్ధంగా ఏర్పడిన అతిపెద్ద గ్రానేట్ రాళ్లు పర్యాటకులకి ప్రత్యేక ఆకర్షణ. పార్క్‌లో ఉండే కంగారూలు తక్కువ సమయంలోనే తనకి మాలిమి అయిపోయాయి. నార్వే, పోలండ్ నేషనల్‌పార్క్‌ల కంటే ఈ పార్క్ నాదియాకి తెగనచ్చేసింది. గోల్డ్ కోస్ట్ నుంచి సిడ్నీకి వారం రోజుల రోడ్ ప్రయాణంతో పాటు, సర్ఫింగ్, పర్వతారోహణం, స్కూబాడైవింగ్ వంటి సాహసయాత్రలు ఆస్ట్రేలియాలో నాదియాకి గొప్ప అనుభూతుల్ని మిగిల్చాయి. ఈక్వెడార్ ప్రాంతంలో గాలాపాగస్ ఓ అందమైన ద్వీపం. అక్కడ బీచ్ అందాలని చూసేందుకు ఉదయాన్నే చేరుకుంది నాదియా. సముద్ర తీరంలో సూర్యుడి తొలికిరణాలు తాకే సమయంలో పక్షుల రాగాలతో పాటు బద్ధకంగా నిద్రలేస్తున్న పెలికాన్లు, చిన్న తొర్రల్లో నుండి బైటికొస్తున్న పెంగ్విన్లు, సీ లయన్స్ తోపాటు మరికొన్ని సముద్ర జీవాల చేష్టలు నాదియాని ఆశ్చర్యపరిచాయి. యూరప్‌లో పుల్‌పిట్ పర్వతారోహణం, టాట్రా మంచు పర్వత మార్గంలో ఐస్ స్కేటింగ్ తనని మరో ప్రపంచానికి తీసుకెళ్లాయి. తక్కువ ఖర్చుతో ప్రయాణాలు చేయడమే కాదు ప్రయాణాల్లో తన అవసరాలకి డబ్బు సంపాదించడం కూడా నాదియాకి తెలుసు.

స్విఫ్ట్‌ని కలుసుకుంది

టేలర్ స్విఫ్ట్ వీరాభిమాని నాదియా. యూరప్‌లోని13 దేశాల్లో టేలర్ స్విఫ్ పాటలతో ఒక కచేరి కూడా పూర్తి చేసింది. ఓస్లో నగర వీధుల్లో గిటార్ తీగల్ని మీటి టేలర్ పాటల్ని ఆలపించడం ద్వారా ఒక సారి 6 వేల రూపాయల్ని సంపాదించింది. ఇక తన అభిమాన గాయనిని కలిసే అవకాశం వస్తే వదులుకుంటుందా? స్విఫ్ట్ బెర్లిన్‌లో ఒక మ్యూజిక్ షోలో పాల్గొంటోందని తెలిసి ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంది నాదియా. అయితే వందలాది ఫోటో గ్రాఫర్ల మధ్య స్విఫ్ట్‌ని కలిసే అవకాశం చేజారిపోయింది. మరుసటి రోజు తీవ్రంగా ప్రయత్నించడంతో అతి తక్కువ మందికి దక్కిన స్విఫ్ట్‌ని కలిసే అవకాశమే కాదు టెయిలర్ స్విఫ్ట్ రాసిన 'లాంగ్ లివ్' పాటకి కోరస్‌ని కూడా పాడింది. నాదియా. అందర్నీ ఆలోచనలో పడేసే ఓ ప్రశ్నతో ప్రపంచ యాత్ర చేసొచ్చిన నాదియా ప్రస్తుతం బ్యాక్ ప్యాకర్స్‌కి సూచలిచ్చే ప్రముఖ బ్లాగర్స్ లిస్ట్‌లో చోటు దక్కించుకుంది.

- శర్వాణి





కవిత్వం

అలా చూడు ప్రపంచం

గడియారం ముల్లు
గుండెల్లో గంటలా మోగుతుంటే
క్షణాల్ని నెత్తిన ఎత్తుకుని
నిర్ణయించబడ్డ సమయానికి
అడుగులు సమాయత్తమవుతుంటాయి

ఇక్కడ గమ్యాలు చేరడమంటే
హారన్ ఊదుతున్న ఆటోల వెంటో
ఘోషించే కెరటాల్లాంటి బస్సుల
వెంటో
హడావుడిగా ముస్తాబైన మెట్రో రైళ్ల
వెంటో
మనల్ని మనం ఆరేసుకోవడమే.

ఇక్కడ జీవితమంటే
ఆకాశాన్ని వంచి మెరుపుల్ని
మోయడమే
వొడిసిపట్టిన సమయాల్ని నిలదీస్తే
దానిలో మనం మనలా జీవించిన
క్షణాల్ని లెక్కించ గలిగామా!
చుట్టూ చూస్తుంటే
పల్లె చాపలా చుట్టుకు పోతున్నట్లు
పట్టణం ఉక్కపోతలో ఉడికిపోతున్నట్లు
చెమర్చిన కళ్ళు చెబుతున్నాయి
వొక సందర్భం
వొక పూర్తి కాని స్వప్నం
మనల్ని కొత్తదారుల వెంట
తరుముతుంటాయి

ఇక్కడ ప్రేమను వొంపే మనసుంది
మనసుని నీ ముందు నిలబెట్టే ఆశా
వుంది
నీతో గడపడానికే సమయం గొడవ
పడుతుంది

కాలం కన్నీరు కారుస్తుంది
మనిషి పరుగుని చూసి
ఒకింత దిగులుగా కాస్తంత జాలిగా

వృద్ధి చెందడమంటే
మనసుకి కారాగార శిక్ష వేయడం
కాదు.
కొన్ని విలువలు కొన్ని మమతలు
కలబోసుకోవడమే.

- గవిడి శ్రీనివాస్
9985010538

ఉపశమనం

ముళ్ల వలయాలలా కొన్ని
సమయాలు నన్ను
ఆవరిస్తూ ఉంటాయి
నా మనసుని మళ్లించే
మార్గాలుంటాయ్
పుట్టగొడుగుల్లా కోరికలు
పుట్టుకొస్తూ ఉంటాయ్
అవి తీరక నిరాశ
గ్రహణాలు
మింగేస్తుంటాయి
ముళ్ళున్న మార్గాల్లో తప్పక
నడవాల్సిన
సందర్భాలుంటాయి
కష్టాల కోరల్లో చిక్కుకున్నా
ధైర్యంగా నవ్వాల్సిన
అవసరాలుంటాయ్
ఇవన్నీ ఎన్నున్నా నా
హృదయాకాశంలో ఒక్క
భానుడివై వచ్చి నీవు
అందించే అనురాగపు
కాంతి
నా మది ప్రపంచాన
ఆనందాన్ని పెంచే
సంక్రాంతి
ఒక్క జాబిలివై నీవు
కురిపించే ప్రేమ వెన్నెల
మెరిపిస్తుంది ఆనందం నా
కన్నుల... ...

- చావలి శేషాద్రి సోమయాజులు

నానమ్మల బడి

ముంబైకి 120 కిమీ దూరంలో 'ఫంగానే' అనే చిన్న పల్లెటూరు వుంది. సరిగ్గా ఆ ఊరి మధ్యలో వుందో బడి. అచ్చంగా నానమ్మలు... అమ్మమ్మల కోసం ఏర్పాటు చేసిందీ స్కూలు. మధ్యాహ్నం 2 గంటలకు మొదలై సాయంత్రం ఐదింటికి అయిపోతుంది. మొత్తం 30 మంది విద్యార్థులున్నారు. అంతా గులాబి రంగు చీర, తెలుపు జాకెట్టు కట్టుకుని స్కూలుకు వస్తారు. అదే వాళ్ల యూనిఫామ్ మరి. అన్నట్టు అంతా 65 నుంచి 90 ఏళ్ల మధ్య వాళ్లే. వృద్ధాప్యం కావడంతో ఆరోగ్య సమస్యలు లేనివారు చాలా అరుదు. కొందరికి కంటి చూపు ఆనదు. కొందరికి కాళ్ల నొప్పులు. మరి కొందరికి వినికిడి సమస్య. ఇలా... ఎన్ని రోగాలున్నా బడి ఎగ్గొట్టాలని మాత్రం అనుకోరు. అన్నట్టు వీళ్ల టీచర్‌కి మాత్రం 28 సంవత్సరాలే. మొదట్లో అంత పెద్ద వయసు వారికి పాఠాలు చెప్పాలన్నప్పుడు కాసింత జంకారు. పిల్లలకైతే అదిరించో బెదిరించో బుజ్జగించో పాఠాలు చెప్పొచ్చు. కానీ వీళ్లకెలా? అసలు వీళ్లు శ్రద్ధగా వింటారా? బుద్ధిగా కూర్చుంటారా? అనుకున్నారు. తీరా పాఠాలు మొదలెట్టాక అనుమానించినట్టే అయ్యింది. క్లాసులో కూర్చుని పాఠాల మీద శ్రద్ధ పెట్టకపోవడంతో టీచరుగారు కోప్పడక తప్పలేదు. అయితే అందుకా విద్యార్థులేమీ బాధపడలేదు. టీచరుగారి మాట మన్నించి బుద్ధిగా కూర్చుని వినడం నేర్చుకున్నారు.

ఇంతకీ వీరిని ఈ వయసులో బడి వరకూ లాక్కొచ్చిన బలమైన అంశమేంటి? అంటే...ఒకటి కాదు. చాలానే వున్నాయి. కాంతాబాయి మొదలుకొని రమాబాయి వరకు ఒక్కొక్కరిది ఒక్కో

అరు పదులు దాటాయంటే చాలు! ఇక జీవితంలో అన్నీ అయిపోయినట్టేనని ఒక నిర్ణయానికి వచ్చేస్తారు. కుక్కి మంచంలో ఓ మూల కూర్చోడానికి రెడీ అయిపోతారు. అంతకుమించి కొత్తగా ఏదైనా నేర్చుకోవడం కాదు కదా...నేర్చుకోవాలన్న ఆలోచన చేయడానికి కూడా పెద్దగా ఇష్టపడరు. అలాంటివారు ముంబై నానమ్మలు.. అమ్మమ్మలను చూసి నేర్చుకోవాల్సింది ఎంతైనా వుంది. వీళ్లు కృష్ణా... రామా...అనుకుంటూ కూర్చోక ఉత్సాహంగా...ముదురు రంగు గులాబి చీరలు కట్టుకొని...భుజాన సంచి తగిలించుకుని ... బడికెళ్తున్నారు.

కోరిక. 'నిరక్షరాస్యురాలిని' అన్న ముద్ర నుంచి బైటపడాలనుకుంటోంది కాంతాబాయి. అందుకే అరవై అయిదేళ్ల వయసులో సహజసిద్ధంగా వచ్చే రోగాలను లెక్క చేయక బడికి బయల్దేరింది. చిన్నతనంలో ఐదుగురు పిల్లలను చదివించలేనంత కటిక పేదరికం వల్ల మగ పిల్లలను మాత్రమే బడికి పంపారు కాంతాబాయి తండ్రి. దాంతో ఇంటి పనులు చూసుకుంటూ వుండిపోయింది కాంతాబాయి. తీరా పెళ్లయ్యాక కూడా అదే పరిస్థితి. నల్గురు పిల్లల ఆలనా పాలనా చూసుకోవడంతోటే సరిపోయింది. ఊళ్లో నానమ్మల బడి ప్రారంభించాక...అక్షరం నేర్చుకోవాలన్న కసి కొద్దీ స్కూల్లో చేరిపోయింది. 87 సంవత్సరాల రమాబాయిది మరో కథ. భర్త ఏనాడో చనిపోయాడు. పిల్లలు లేరు. జీవితమంటే ఇదేనా? అన్న నిరాశ నిస్పృహల లోంచి బైటపడి బడికి బయల్దేరిందామె. చక్కగా తోటి విద్యార్థులు, పాఠాలు, కొత్త విషయాలు నేర్చుకోవడంలో మునిగిపోయిన ఆమెకు రోజులు తెలీకుండానే గడిచిపోతున్నాయి. ఇక... రాధాబాయి ఇంట్లో తన పనులన్నీ పూర్తి చేసుకుని మరీ బడికి బయల్దేరుతుంది. 'నిశానీగానే రాలిపోవాలా' అన్న బాధ నుంచి ఆమె ఇప్పుడిప్పుడే బైటపడుతోంది. మనవళ్లు, మనవరాళ్లతో కలిసి చదువుకోవడం...ఏమైనా సందేహాలుంటే వారితో చెప్పించుకోవడంతో బాగా కాలక్షేపమవుతోంది.

ఆలోచన వచ్చిందిలా...

గ్రామస్తులంతా దాదాపుగా వ్యవసాయం మీదే ఆధారపడతారు. చాలా కొద్ది మంది మాత్రం చుట్టుపక్కల ఫ్యాక్టరీల్లో చిన్నాచితకా పనులు చేసుకుంటారు. వీరికి అక్షర జ్ఞానం అంతంతమాత్రంగానే వుంటుంది. మరీ ముఖ్యంగా మహిళలకు. దాంతో బ్యాంకులకు, పోస్టాఫీసులకు...ఇక్కడ అక్కడ అనేముంది? ఎక్కడికెళ్లినా వేలిముద్రలే తప్ప సంతకాలు పెట్టలేరు. బస్సుల మీది ఊళ్ల పేర్లు, పత్రికల పతాక శీర్షికలు కూడా చదవలేరు. అదే వారికి చిన్నతనంగా అనిపించసాగింది. సరిగ్గా అలాంటి వాతావరణం నెలకొన్న తరుణంలో ఈ ఏడాది మహిళా దినోత్సవం (మార్చి 8) నాడు మోతీరామ్ దలాల్ చారిటబుల్ ట్రస్ట్, యోగేంద్రతో కలిసి 'నానమ్మల బడి'ని మొదలెట్టింది. అందుకు గ్రామస్తులు తలా ఒక చెయ్యి వేశారు. చిన్నతనంలో ఎటూ చదువుకోలేదు. ఇప్పుడైనా నాలుగక్షరాలు నేర్చుకుందామన్న పట్టుదల అవ్వలను కదిలించింది. బడి వైపు అడుగులు వేయించింది.

తెలుసా

- బిడ్డ పుట్టిన గంటలోనే తల్లిపాలు ఇవ్వాలి. ఎప్పుడు పాలకేడిస్తే అప్పుడు అందించాలి. పాసిఫైయర్‌లు, బాటిల్ పీకలతో సరిపెట్టొద్దు.

- తల్లిపాలలోని యాంటీబాడీలు పిల్లలకు డయేరియా, నిమోని యాల్ని వంటి వ్యాధుల నుంచి బయటపడేస్తాయి. పసిపాపలకు సంతులనంగా పోషకాలు అందేది తల్లి పాల ద్వారానే.

- తొలి రోజుల్లో తల్లిపాలు చాలా చిక్కగా పసుపు రంగులో ఉంటాయి. వీటిని 'కొలొస్ట్రామ్' అంటారు. దీనిలో కాల్షియమ్, పొటాషియమ్, ప్రొటీన్లు, ఖనిజాలు, యాంటీ బాడీస్ పుష్కలంగా ఉంటాయి. శిశువు అవసరాలకు సరిపడా పోషకాలుంటాయి. అందుకే వీటిని 'లిక్విడ్ గోల్డ్' అంటారు.

లిక్విడ్ గోల్డ్

- ఒక రోజు బిడ్డకు పాలివ్వడానికి అవసరమయ్యే జీవ క్రియ శక్తి ఏడు మైళ్ల నడకకు సమానం.

- తల్లి పాలు తీసుకుంటున్న శిశు వుల్లో సడెన్ ఇన్‌ఫ్యాంట్ డెత్ సిండ్రోమ్ (సిడ్స్) మరణాలు తక్కువ.

- సాధారణంగా బిడ్డ 67 శాతం పాలను మాత్రమే తల్లి నుంచి తీసు కుంటుంది.

- పాలివ్వడం తల్లికి కూడా మంచిదే. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, టైప్-2 మధుమేహం, ఆస్టియోపోరోసిస్, హృద్రోగ సమస్యల రిస్క్ తగ్గుతుంది. పాలిస్తున్న తొలి ఆరు నెలల కాలం వరకు తిరిగి గర్భం దాల్చకుండా కూడా పనిచేస్తుంది. కాన్పు తర్వాతి డిప్రెషన్ నుంచి త్వరగా కోలుకునేలా చేస్తుంది.

- పాలిస్తున్న కాలంలో తల్లులు మరింత ఆహారాన్ని తీసుకోవాలి. క్షీరోత్పత్తి కోసం 25 శాతం శారీరక శక్తిని తీసుకుంటుంది. సాధారణంగా మెదడు 20 శాతమే తీసుకుంటుంది.

- మిగతావారి కంటే పసితనంలో తల్లిపాలు ఎక్కువగా తీసుకున్నవారు మేధో సామర్థ్య పరీక్షల్లో అద్భుత ఫలితాల్ని కనబరిచారు. వీరు టైప్-2 మధుమేహంతోపాటు ఊబకాయ సమస్యలకు అంతగా గురవరని తేలింది.

- తల్లిపాలలోని కొన్ని పదార్థాల వల్ల బిడ్డకు మానసిక ప్రశాంత లభిస్తుంది. మంచి నిద్ర పడుతుంది. తల్లికి ఆందోళన స్థాయి కూడా తగ్గుతుంది. బిడ్డతో బంధం బలపడటానికి కారణమవుతుంది.

- బిడ్డ ఎదిగే కొద్దీ అవసరాలకు తగ్గట్టు పాలలోని పోషకాల మార్పు జరుగుతుంటుంది. 3-9 నెలల వయసు బిడ్డలకు అందే పాలలో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్కోసారి రోజురోజుకూ బిడ్డ అవసరాలకు తగ్గట్టు పాల సాంద్రత మారిపోతుంటుంది. బిడ్డ అనారోగ్యానికి లోనైనా, వేడిమి ఎక్కువగా ఉన్నా నీటి శాతం పెరిగి డీ-హైడ్రేషన్ నుంచి కాపాడుతుంది.

- బిడ్డ శరీర ఉష్ణోగ్రతలో ఒక్క డిగ్రీ తేడా వచ్చినా తల్లి రొమ్ములు గుర్తించి దానికనుగుణంగా ఉష్ణోగ్రతను మార్చుకుని బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుంది. అందుకే తల్లికీ, శిశువుకీ మధ్య స్కిన్-టు-స్కిన్ కాంటాక్ట్ ఉండాలని వైద్యులు సూచిస్తారు.

అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవం సందర్భంగా...

వన మహో... ఉత్సవం

- డా॥ యం. ప్రగతి
9440798008

చాలా ఏళ్ళ క్రితం.... ఓ కీకరాణ్యం....శిశిరం పూర్తయి వసంతం చేరువవుతోంది. నాలో పండుటాకులన్నీ రాలిపోయి లేత చివుళ్ళు విచ్చుకుంటున్నాయి. వాటి చాటున పూత కూడా తొంగి చూస్తోంది. నాతోపాటు అడవిలో చెట్లన్నీ కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. కానీ నాలో సంతోషం లేదు. ఏదో అసంతృప్తి. "ఏంటి వేప మామా, దిగులుగా వున్నావు? అడివంతా కొత్త అందాలు పులుముకొని పండుగ వాతావరణం నింపుకుంటుంటే నీకేమయింది, ముడుచుకొని పోయావు?" పక్కనే వున్న కానుగ చెట్టు కొమ్మలూపుతూ అడిగింది నన్ను. "ఏం లేదు కానూ, ఇంత పెద్దగా విస్తరించామా, ఇన్ని కొమ్మలున్నాయా ఇంతగా ఎదిగి కూడా ఏ ఒక్కరికీ మన సేవలందించకుండానే జీవితం ముగిసిపోతుందే అని నా బాధ." నా మాటలకు ఆశ్చర్య పోయింది కానుగచెట్టు. "అదేంది మామా అట్లా అంటావు? నీ నీడన ఎన్ని జంతువులు సేద తీరుతున్నాయి, ఎన్నో పక్షుల గూళ్ళకు నీ కొమ్మలే ఆదరువు. క్రిమి కీటకాలెన్నో నిన్ను ఆసరాగా చేసుకొని బతుకుతున్నాయి. ఇంతకంటే ఏం సేవలందించాలి చెప్పు?" అనునయంగా అన్నది కానుగ చెట్టు. "అది నిజమే కానూ. ఎన్నో జీవరాశులకు నా శరీరం ఆధారం. పక్షులు, జంతువులు, క్రిమి కీటకాలు నా నీడన చల్లగా బతుకుతున్నాయి. వాటి పుణ్యమా అని నా జాతి కూడా అన్ని ప్రాంతాలకు విస్తరించి పిల్లా పాపలతో వర్థిల్లుతున్నాను. కానీ అన్ని జీవరాశు ల్లోకి మహోన్నతమైనది మానవ జన్మ అంటారు కదా. అంత గొప్ప మానవ జాతికి సేవలందించకుండా ఈ అడవిలో పడున్నామే అనేదే నా బాధ. మళ్ళీ జన్మంటూ ఉంటే ఇలాగే చెట్టునై మనుషుల మధ్య పుట్టి, వారికి సేవ చేసి తరించాలి."

•••

ప్రస్తుతం.... ఓ నర్సరీలో....

"అరె కానూ.... నువ్వొచ్చేశావా? మొత్తానికి నా కోరిక తీరింది చూశావా! ఇప్పుడు మనకు మానవసేవ చేసే భాగ్యం దొరికింది. ఇక ఈ జన్మ ధన్యమవుతుంది." కానుగ మొక్కను చూడగానే సంబరంగా అన్నాను. "వేప మామా బాగున్నావా? నువ్వన్నట్లు మనుషులకు సేవ చేయొచ్చు కానీ ఈ చిన్న చిన్న కవర్లలో మనం ఎలా బతకడం, ఎదగడం? నాకు ఊపిరాడకుండా వుంది. ఎప్పుడెప్పుడు బయట పడదామా అనిపిస్తోంది." కానుగ మొక్క ఇబ్బంది నాకర్థమైంది. "ఎన్నాళ్ళులే కానూ... ఎవరో ఒకరు మనల్ని తీసుకుపోయి నేలలో నాటి, సంరక్షిస్తారు. అప్పుడు మనం స్వేచ్ఛగా ఎదగొచ్చు. అదిగో చూడు. అక్కడెవరో నాయకుడు మాట్లాడుతున్నాడు, మన గురించే అనుకుంటాను." ఇద్దరం ఆకులు రిక్కించి వినసాగాము. ఆ పెద్దాయన ఈ ఊరి ఎమ్మెల్యే అంట.

".... కాబట్టి సోదరులారా, చెట్లను పెంచితేనే మానవ మనుగడ సాధ్యం. చెట్లను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి. ఈసందర్భంగా మీకు మనవి చేసుకుంటున్నాను ఈ వనమహోత్సవం లో భాగంగా పది లక్షల చెట్లు మన నగరంలో నాటాలి. పది లక్షల మొక్కలు పంపిణీ చేయడానికి మా ప్రభుత్వం అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది. వీటిని వీధి వీధినా, రోడ్ల పక్కనా, ఇంకా మీ ఇళ్ళ దగ్గర నాటండి. పర్యావరణాన్ని కాపాడండి..." పెద్దాయన ఉపన్యాసం పూర్తి కాగానే బడి పిల్లలు అవేవో అట్టలు పట్టుకొని అరుస్తున్నారు. "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" "చెట్లే మనిషికి ఆధారం" వృక్షో రక్షతి రక్షితః" అంటూ అరుస్తూ వెళ్లారు.

"చూశావా కానూ! రేపో మాపో మనల్ని తీసుకెళ్ళి ఎక్కడో భూమిలో నాటి మన ఆలనాపాలనా చూసుకుంటారు." "నిజమే మామా. కాకపోతే నాకొకటే బాధ. మనమిద్దరం ఒకే చోట ఉంటామో లేదో?" కానుగ మొక్క దిగులుగా అన్నది. చీకటి పడి ఇద్దరం నిద్రావస్థలోకి జారుకున్నాము.

"రేయ్ ఆ చెట్లను ఈ ట్రాక్టర్లోకి ఎయ్యండ్రా." "ఎంతసేపు బెరీన కానీండ్రా." అరుపులు, కేకలతో మెలకువ వచ్చింది నాకు. మా పక్కనున్న మొక్కలను ఎత్తి ట్రాక్టర్లోకి విసిరి పారేస్తున్నారు. కానుగ మొక్క కనిపించలేదు. దాన్ని కూడా ఎత్తి పడేసినట్టున్నారు. "వామ్మో! ఏందిరా నాయనా ఇట్లిసిరి పారేస్తున్నారు, నడుములిరిగి పోతాయేమో!" పక్కకు నక్కాలన్న నా ప్రయత్నం ఫలించలేదు. ఓ మొరటు వెధవ ఒక్క చేత్తో నా చుట్టూ వున్న కవరును పట్టుకొని ఎత్తి ట్రాక్టర్లోకి గిరాటేశాడు. "చచ్చాన్రా బాబోయ్!" నా అరుపు నాకే వినబడలేదు. ఆపైన నాపై ఎంతోమంది వచ్చి పడ్డారు (ఎన్నో మొక్కలు వచ్చి పడ్డాయి). నాకు ఊపిరే ఆడటం లేదు. "బాబ్బాబు పక్కకు జరగండ్రా!" ఆ మొక్కలు కూడా నాలాగే స్వయంగా కదల్లేవని తెలిసినా అరిచాను.

మొత్తంమీద ట్రాక్టరు నిండా మొక్కలు నింపాక ట్రాక్టరు బయల్దేరింది. "అబ్బ ఈ కుదుపులేంటిరా బాబూ! ప్రయాణమంటే ఇలాగే ఉంటుందా, లేకపోతే ఈ డ్రైవరు వెధవ అలా తోలుతున్నడా?" ఓ వైపు పైన పడిన మొక్కల తాకిడి, మరోవైపు కుదుపుల వత్తిడి. "ఈ నరకం నుంచి ఎప్పుడు బయట పడతాన్రా నాయనోయ్!" దాదాపు ఓ గంటపైనే సాగిన ఈ నరకం లాంటి ప్రయాణం ముగిసినట్లుంది. ఈ ట్రాక్టర్ ఎక్కడి కొచ్చి నిలబడిందో తెలియదు. "పార్కు గేట్లు తియ్యండ్రా రేయ్!" డ్రైవర్ కేకేస్తున్నాడు. ట్రాక్టర్ ఇంకొంచెం ముందుకు కదిలి పైకి లేస్తోంది. "అరె ఏంటిలా పైకి లేస్తోందిది? అబ్బో కిందికి జారిపోతున్నాను." అంటే ఒక్కొక్కరినీ (ఒక్కో మొక్కను) మెల్లగా కిందికి దించరా వీళ్ళు. "అరె పడిపోతాన్రా బాబోయ్. అయ్యో..." ఎక్కడ పడ్డానో తెలియదు. మళ్ళీ నా మీద ఎంత మందో? (ఎన్ని మొక్కలో?) అంటే ఇప్పుడు కూడా నాకు విముక్తి లభించలేదు. పైగా కవర్లో వున్న ఆధారం (మట్టి) కూడా బలహీనమై పోయింది (తగ్గిపోయింది). నేనసలు బతుకుతానా?

మమ్మల్ని పారేసి ట్రాక్టరు వెళ్ళిపోయింది. కాలం బరువుగా సాగుతోంది. ఏది పగలో ఏది రాత్రో తెలియడం లేదు.

ఆకలవుతోంది.... ఎండ తగలడం లేదు.

దప్పికవుతోంది.... నీళ్ళు పోసే నాథుడు లేదు.

ఆ నర్సరీ లోనే నయం. కాస్త ఎండకు పెట్టి నీళ్ళు పోసేవాళ్ళు. మా పరిస్థితి ఇంతేనా? ఇదేనా చెట్లను రక్షించడమంటే...? నాకు దుఃఖం తన్నుకొస్తోంది. అలా ఎన్ని రోజులు గడిచాయో తెలియదు. కానుగ పిల్ల ఎక్కడుందో, ఎలా వుందో...?

ఉన్నట్టుండి బయట ఏదో కలకలం. "ఈరోజు మంత్రి గారొస్తారు. మన వార్డులోనే వనమహోత్సవం ప్రారంభమయితాది. ఈ చెట్లు మన వీధి మెయిన్ రోడ్డు కాడికి తీసుకుపొండ్రా" ఆయనెవరో కార్పొరేటర్ గారి భర్త గారంట ఆర్డర్లేస్తున్నాడు. "అదేందన్నా! ఆరు నెల్ల కిందే ఆ రోడ్డుకు సెట్లు నాటినాం గదా! ఇప్పుడిప్పుడే అయి బాగా పెరుగుతాండాయి. ఇంకెక్కడన్నా నాటదామన్నా." ఎవరో కార్యకర్తనుకుంటా నచ్చజెప్పబోతున్నాడు. "ఏంరా, ఎక్కడ నాటియ్యాలో నాకు తెల్దా. మెయిన్ రోడ్డుకయితే ఫోటోలు బాగా వస్తాయి. పేపరోల్లు, టీవీ వాల్లు సందుల్లోకి, గొందుల్లోకి వస్తారా? మంత్రి గారికి మురిక్కాలవల కంపు చూపించాలనా నీ ఎదవైడియా? సెట్లు నాటింటే ఆటిని పీకేయండి. ఆ గుంతల్లోనే ఈ సెట్లు నాటిద్దాం. ముందు ఆ పాత సెట్లు పీకేసే పని చూడండి."

హూంకరించాడు నాయకుడు. "అట్నేన్నా!" అనుచరుల నోళ్ళు మూతబడ్డాయి. అంటే ముందు నాటిన చెట్లు పీకేసి, వాటి స్థానంలో కొత్తవి నాటుతారా? ఎంత అన్యాయం? రేప్పొద్దున మా గతీ అంతే కదా! ఏం బతుకుల్రా బాబూ మావి. ఏదో మనుషులకు మేలు చేద్దామంటే వీళ్ళకు ఆ అర్హత కూడా వున్నట్లు లేదే. ఇప్పటికే నాకు సగం ప్రాణం పోయింది. ఇక వీళ్ళ చేతుల్లో పడితే మిగిలిన ప్రాణానికి కూడా గ్యారంటీ లేదు. అందుకే అప్పటికే వాడిపోయిన నేను పూర్తిగా ప్రాణం పోయినట్లు ఆకులు వేలాడేశాను.



కార్పొరేటర్ గారి అనుచరులు పైనున్న మా అన్నదమ్ములు, స్నేహితుల నుంచి ఆరోగ్యంగా వున్న వాళ్ళను ఎంపిక చేసుకున్నారు. నేను అడుగున వున్నందుకు, అదీ చచ్చినట్లు నటించినందుకు బతికి పోయాను. హడావుడి మొదలైంది. మంత్రిగారు వచ్చినట్టున్నారు. చోటామోటా నాయకులు, వాళ్ళ అనుయాయులు మమ్మల్ని కసాబిసా తొక్కుతూ వెళ్లారు. "ఎంత తప్పయి ఈ జనారణ్యంలో పడ్డాం. ఇక్కడి కంటే ఆ కీకరాణ్యం లోనే మేలు. మా నీడన బతికిన జంతుజాలలేవీ మాకు హాని చేయలేదు. సరికదా, మా జాతిని బతికించారు." ప్రాణం వుందో పూర్తిగా పోయిందో తెలియడం లేదు.

అవతల మట్టి పూసుకున్న చేతులతో మంత్రిగారు కెమెరాలకు ఫోజులిచ్చారు. మంత్రి గారి కారు గుయ్... గుయ్... మని శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది. మొక్కలు నాటే మహా... ఉత్సవ ప్రహసనం పూర్తయినట్లుంది.



"రేయ్ ఆ మిగిలిన వాటిలో మీకెవురికన్నా కావాలంటే తీసకపొండ్రా" కార్పొరేటర్ గారి పతిదేవులు గారు పెద్ద మనసుతో అనుమతిచ్చేశారు. "ఇయ్యి మాకెందుకన్నా? ఏ రోజా మొక్కలో, మల్లెంట్లో అయితే ఇంట్లో ఆడోల్లకు నచ్చుతాయి." అనుచరులక్కూడా మేం నచ్చలేదు, వొదిలేసి వెళ్ళిపోయారు.

ఇక తప్పలేదు. ఉన్న కాస్త మట్టినీ ఆధారంగా చేసుకొని ఊపిరి గట్టిగా పీల్చుకొని ప్రాణం నిలబెట్టుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించాను. పైన వత్తిడి తగ్గడం వల్ల కాస్త గాలీ, ఎండా తగులుతున్నాయి. కానీ దప్పికే తీరడం లేదు. నీళ్ళు ఎలా దక్కించుకోవాలి?

ఇంతలో ఎక్కడి నుంచో బడిపిల్లలు బిలబిలమంటూ వచ్చారు. "మనమీ చెట్లు బడికాడ నాటదాం తీసుకు పదండ్రా. పెద్ద సారు బడి ముందరంతా పచ్చగా చెయ్యాలని చెప్పినాడు కదా!" పిల్లల గుంపుకు నాయకుడనుకుంటా అంటున్నాడు. "అవునన్నా, ఈ మొక్కలన్నీ మనమే తీసకపోయి నాటదాము. అన్నా, ఈరోజు నా పుట్టిన్రోజు. పుట్టిన్రోజు నాడు ఒక మొక్క నాటాలని, దానికి నీళ్ళు పోసి పెంచాలని, అది నాతో పాటే పెరుగుతుందని మా టీచరమ్మ చెప్పినాది. ఈ యాప చెట్టు నేను తీసుకొచ్చి నాటతానన్నా." ఓ చిన్న పిల్లాడు అడుగుతూ నన్ను తన రెండు చిన్నారి చేతులతో పొదివి పట్టు కున్నాడు. కల్మషం లేని వాడి చేతి చెమ్మకే వాడిన నా ఆకులు, ఉడిగిన నా ఆశలు విచ్చుకున్నాయి. అంతలో ఆశ్చర్యం... మరో పిల్లాడి చేతిలో కానుగ మొక్క. నన్ను చూసి సంబరంగా ఆకులూపింది.

✦





చెట్లకు పూలు పూస్తాయని, కాయలు కాస్తాయని మనకు తెలుసు. కానీ చెట్లకు కుర్చీలు, టేబుళ్లు పండిస్తే..! ఆశ్చర్యంగా ఉంది కదా! లండన్‌కు చెందిన ఫర్నీచర్ డిజైనర్ గావిన్ మన్రో ఇలానే ఫర్నీచర్ పంట పండిస్తానంటున్నాడు. చెట్టును పెకిలించి ఫర్నీచర్ తయారు చేయడం కన్నా ఇలా చెట్టుకే ఫర్నీచర్‌ను కాయించడం పర్యావరణానికి గొప్ప మేలే చేస్తుంది.



ఫర్నిచర్ పంట

గావిన్ ఫర్నీచర్ డిజైనింగ్‌లో మంచి పేరున్న కళాకారుడు. ఫర్నీచర్‌ను సాధారణంగా చెక్కలను కోసి అతికించి రూపొందిస్తారు. ఈ విధానం బొత్తిగా నచ్చలేదు గావిన్‌కు. ఏదన్నా వినూత్నంగా ఆలోచించాలనుకున్నాడు అప్పుడు తన బుర్రలో మెదిలింది చిన్నప్పుడు చూసిన బొన్సాయ్ చెట్టు. చూడ్డానికి మొక్కంత పరిమాణంలోనే ఉన్నా కూడా అది ఏపుగా ఎదిగిన వృక్షం. ప్రత్యేకంగా పెంచే బొన్సాయ్‌ల గురించి చాలా విషయాలు నేర్చుకున్నాడు. ఈలోగా గావిన్‌కు వెన్నెముక శస్త్ర చికిత్స జరిగింది. తన శరీరాన్ని సరైన ఆకృతిలో ఉంచేందుకు ఒక ఫ్రేమును బిగించేవారు. రోజుల తరబడి ఒకే స్థితిలో శరీరాన్ని ఉంచడం ద్వారా ఆకృతి చెడకుండా నిలపగలరని తెలుసుకున్నాడు. ఫర్నీచర్ డిజైన్‌లో డిగ్రీ చేసిన గావిన్‌కు ఈ రెండు విషయాలు ఓ కొత్త పోకడకు ఐడియానిచ్చాయి. మొక్కల్ని కూడా ఫ్రేమ్‌ల్లో బిగించి జాగ్రత్తగా పెంచితే అవి అనుకున్న రూపు సంతరించుకుంటాయని ప్రయోగాల ద్వారా అర్థం చేసుకున్నాడు. మరి ఆ రూపు కుర్చీలు, టేబుళ్లు, ల్యాంప్ షేడ్‌లుగాను ఎందుకు కట్టకూడదని ప్రశ్నించుకున్నాడు. సహజమైన వస్తువులతో ఫర్నీచర్ తయారు చేసే విధానంలో అప్రెంటిసిషిప్ కూడా పూర్తి చేసిన గావిన్‌కు అదో ప్లస్ అయ్యింది.

పురాతన విజ్ఞానం, ఆధునిక సాంకేతికల మధ్య పెనవేసుకున్న అల్లిక ఇది. ఒక్క మేకూ దిగకుండానే, ఎక్కడా అతుకు పడకుండానే కలపతో అత్యంత సహజంగా కుర్చీలు, బల్లలు ఇతర ఫర్నీచర్‌ను తయారు చేసే విధానంగా దీన్ని మెరుగుపరిచాడు. ప్రకృతి, కళాకారుడు కలిసి తీర్చిదిద్దిన అద్భుతాలుగా వాటిని పిలుస్తున్నారు.

సాధారణంగా గుమ్మం ముందు పందిరికో, పోర్టికో మీదుగానో లతలు, తీగలను పాకించడానికే చాలా కాలం పడుతుంది. ఎంతో శ్రద్ధ, ఓపిక కావాలి. మరి గావిన్ విధానంలో ఓ కుర్చీ తయారు కావాలంటే నెలలు కాదు ఏళ్లు పడుతాయి. ఒక్కో వస్తువు తయారు కావడానికి ఏడెనిమిదేళ్ళ కాలం పడుతుంది మరి.

మొక్కలకు మౌల్డ్

మొక్కలకు ప్లాస్టిక్ మౌల్డ్‌లు అమర్చి వాటి కొమ్మలను తాను తయారుచేయదల్చుకున్న వస్తువులకు అనుగుణంగా పెరిగేట్టు వంచుతూ కత్తిరిస్తూ మొక్కను మలుస్తాడు. ఆ మొక్క దృఢంగా పెరిగేట్టు చూస్తాడు. పూర్తి ఆకారం వచ్చాక శీతాకాలంలో మొక్క నుంచి వస్తువు ఆకారాన్ని వేరు చేస్తాడు. పచ్చదనం పోయే వరకూ ఆరబెట్టి నునుపుగా పాలిష్ వేస్తాడు. ఒక్క మేకు అవసరం లేకుండానే ఎక్కడా గమ్ పెట్టి అతకకుండానే, జాయింట్ చేయకుండానే తయారయ్యే ఈ ఫర్నీచర్ మన్నిక మామూలు ఫర్నీచర్‌తో పోలిస్తే చాలా ఎక్కువంటాడు గావిన్. ఈ ఫర్నీచర్ తయారీకి ఎక్కువగా విల్లో ట్రీనే ఎంచుకుంటాడు. వీటితో పాటు యాష్, హాజెల్, క్రాబ్ యాపిల్, సెసైల్ ఓక్, రెడ్ ఓక్ వంటి మొక్కల మీద కూడా ప్రయోగాలు చేస్తూ విభిన్నమైన లుక్, ఫినిషింగ్‌ల కోసం ప్రయత్నిస్తున్నాడు. ప్రతి వంద మొక్కలకూ ఒక పర్యవేక్షకుడు ఉంటాడు. అంటే అతగాడు దాదాపు వెయ్యి కొమ్మలను పదివేల చిగుళ్ళను నిరంతరం పర్యవేక్షించాలి. అందుకు ఓపిక చాలా అవసరం. గావిన్ 'ఫుల్ గ్రోన్' పేరుతో ఈ రకమైన ఫర్నీచర్ తయారీని భారీగా పారిశ్రామిక స్థాయిలో చేపట్టాడు. తన క్షేత్రంలో సోలార్ విద్యుత్‌ను ఉపయోగించడమే కాకుండా మొక్కలకు బిగించే ప్లాస్టిక్ మౌల్డ్‌లకు రీసైక్లబుల్ ప్లాస్టిక్‌ని వినియోగిస్తూ, మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేయిస్తూ మామూలు ఫర్నీచర్‌తో పోలిస్తే అతి తక్కువ ఖర్చు, శక్తి వనరుల వినియోగంతో వీటిని రూపొందిస్తున్నాడు. పర్యావరణానికి మేలు చేస్తున్నాడు. ఈ విధానంలో దాదాపు 75 శాతం శక్తి వనరులు ఆదా అవుతాయట. 400 టేబుళ్ళు, కుర్చీలు లాంతరు బుట్టల తయారీకి పెద్ద ఎత్తున మొక్కలు వేశారు. ఫర్నీచర్ పంట చేతికి రావాలంటే మరో ఏడాది పడుతుందట.



- అనంతోజు మోహనకృష్ణ

కోట్లు ఖర్చుచేసి అన్ని వనరులున్న ప్రదేశాల్లో పెద్ద పెద్ద కళాశాలల్ని నిర్మిస్తున్న నేటి రోజుల్లో ఎలాంటి వనరులూ లేని జోధ్‌పూర్‌లో 95 ఎకరాల్లో ఓ కాలేజిని నిర్మించాడు వరుణ్ ఆర్య. ఉప్పు కయ్యలతో నిండిన ఆ ప్రదేశం నిర్మాణానికి ఏమాత్రం పనికిరాదని ఇస్రో శాస్త్రవేత్తలు, జోధ్‌పూర్ వ్యవసాయశాఖ అధికారులూ తేల్చిచెప్పారు. నిర్మాణం మొదలెట్టిన తొలి దశ నుండి లంచాలు, స్థానిక రాజకీయ శక్తుల నుండి వేధింపులు ఎదురయ్యాయి. అధిక వ్యయంతో భూమిని కొనే స్థోమత లేకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానంతో బంజరభూమినికొని పచ్చని చెట్లతో అందమైన ప్రదేశంగా మార్చాడు వరుణ్. తను నిర్మించిన ఆరావళి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇప్పుడు వేలాది మంది విద్యార్థులకి విద్యనందించడంతో పాటు వందలాది ఎకరాల్లో





వరుణ్ ఆర్య

బీడు భూమిలో పచ్చటి కళాశాల

నిర్మించిన లాన్లు, నీటి కొలనులు, వైద్యపరమైన మొక్కలతో ఏటా వేలాదిగా తరలి వచ్చే వలస పక్షులకి నిలయంగానే కాదు రాజస్థాన్‌లో పేరొందిన టూరిస్ట్ ప్రదేశంగా పేరు గడించింది.

రాజస్థాన్ పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది బంజర భూములు, ఒయాసిస్‌లు. తీవ్ర నీటి కొరతని ఎదుర్కొంటున్న రాజస్థాన్‌లోని వివిధ నగరాల్లో జోధ్‌పూర్ ఒకటి. కొన్ని మైళ్లు ఉప్పు కయ్యలతో నిండిన ప్రదేశాలతో పాటు బీడుబారిన ఆ ప్రాంతాన్ని అక్కడి ప్రజలందరూ ఎందుకూ పనికి రాని భూమిగా పరిగణిస్తారు. అలాంటి ప్రాంతంలో ప్రతిష్ఠాత్మకమైన ఓ కళాశాలని నిర్మించాలనుకున్నాడు వరుణ్ ఆర్య. అమెరికాలో ఒక బహుళజాతి కంపెనీలో 12 ఏళ్లు సీనియర్ అధికారి హోదాలో ఉన్న వరుణ్ ఉద్యోగాన్ని వదిలి బంజరభూముల్లో కళాశాల నిర్మించాలనుకోవడం అందరికీ వింతనిపించింది.

బీడుబారిన భూముల్లో కళాశాల నిర్మించడం అంత తేలికైన విషయం కాదు. నాణ్యమైన భూమి కోసం ప్రయత్నించినా అధిక ధరతో పాటు డబ్బును ఒక్క సారి చెల్లించాల్సిన షరతులుండడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. జోధ్‌పూర్‌లో 95 ఎకరాల భూమిని కొని నిర్మాణ పనులు ప్రారంభించాడు వరుణ్ ఆర్య. ఇస్రో శాస్త్రవేత్తలు, జోధ్‌పూర్ వ్యవసాయశాఖ అధికారులూ నిర్మాణానికి ఏమాత్రం పనికిరాదని చెప్పిన ప్రదేశంలో కళాశాల నిర్మిస్తున్నాడంటూ తన మిత్రులు చులకనగా మాట్లాడేవారు. దాదాపు 40సెం.మి.లోతులో బంకమట్టి ఉండడంతో తొలి దశలోనే నిర్మాణానికి అవరోధాలు ఎదురయ్యాయి. అక్కడ పనిచేసే వారందరూ సమస్యలపై దృష్టిపెడితే పరిష్కార మార్గాల దిశగా నడిచేవాడు వరుణ్. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి 28 వేల చదరపు అడుగుల్లో నిర్మించిన కళాశాల భవన నిర్మాణానికి స్థానికులు అడ్డుపడ్డారు. మేర్వాడ్ ప్రాంతానికి చెందిన మహారాజా గజ్‌సింగ్ సాయంతో మూడు కి.మీ మేర భారీ ప్రహరీగోడలతో ఆరావళి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ నిర్మాణ పనుల్ని పూర్తిచేశారు. ఉన్నతవిద్యకి అవసరమైన అత్యాధునిక సదుపాయాలతో పాటు విద్యార్థుల వికాసానికి తోడ్పడే పరిసరాలు ఇక్కడ రూపుదిద్దుకున్నాయి. ఉప్పు కయ్యల్లో మొక్కలు పెంచడం పెద్ద సవాలుగా మారింది. నేల సారవంతంగా మార్చడం కోసం ఐదారడుగుల లోతు భూమిని పెకిలించడంతోపాటు సారవంతమైన మట్టిని ఆ ప్రదేశానికి తరలించారు. ఉప్పు శాతం తక్కువగా ఉన్న ప్రదేశాలలో జనప సంచుల్లో మట్టిని ఉంచి మొక్కల్ని పెంచారు. సేంద్రీయ ఎరువులను ఉపయోగించి మరింత సారవంతంగా మార్చిన ప్రదేశంలో మూలికల్ని, కూరగాయ మొక్కల్ని సాగుచేశారు. ఇరువైపుల 100మీ పొడవున ఏర్పాటు చేసిన లాన్ల వెంబడి సౌరఫలకాల్ని అమర్చడంతోపాటు దాదాపు 60 వేల మొక్కలతో కళాశాల ప్రాంగణం ఆహ్లాద కరంగా మారింది. నీటి వనరుల్ని పెంచేందుకు కళాశాల ఆవరణలోనే ఇంకుడు గుంటలు, ఆరు కొలనుల్ని ఏర్పాటు చేశారు. 2.5 కోట్ల లీటర్ల నీటిని నిల్వచేసేందుకు 10 అడుగుల లోతులో తవ్విన ఈ కొలనుల్లో అధికంగా వర్షపునీరు చేరినా అది కొద్ది రోజులకే ఉప్పునీరుగా మారిపోయింది. ఆరేళ్లుగా నీటిని నిల్వ చేస్తుండటంతో ప్రస్తుతం మొక్కలకి నీరందించేందుకు, నిత్యవసరాలకు ఆ నీరే ఉపయోగపడుతోంది. అంతే కాకుండా నిరంతరం ఈ కొలను ఒడ్డున సేదతీరేందుకు వచ్చే వలస పక్షులతో మరింత అందంగా కనిపిస్తుందీ ప్రదేశం. అధిక నీరు బైటికెళ్లేందుకు ఏర్పాటు చేసిన వంతెనల్లాంటి పెద్ద నిర్మాణాలు ఓ ప్రత్యేక ఆకర్షణ. మొక్కలకి తగిన నీరందించడం, ఇంకుడు గుంటల పర్యవేక్షణ బాధ్యతల్ని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్‌తోపాటు గజరాజ్ సింగ్-2 చేపట్టారు. ఉప్పుకయ్యలుగా మారిన భూమిలో ఎన్నో ప్రతిఘటనల మధ్య 2005లో ప్రయోగాత్మకంగా చేపట్టిన కళాశాల భవన నిర్మాణం ఇప్పుడు జోధ్‌పూర్‌లో ఒక గొప్ప కట్టడంగా పేరు గడించింది. ఒకప్పుడు బీడుబారిన ప్రదేశంగా ఉన్నా నేడు పచ్చటి చెట్లతో, వింత గొలిపే నిర్మాణాలతో ఆరావళి కళాశాల వేలాది పర్యాటకుల మనసు దోచుకుంటోంది.

పీతల కూర

కావాల్సిన పదార్థాలు

పీతలు- 400గ్రాములు
ఉల్లితరుగు-1/2 కప్పు
అల్లం తరుగు-2 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి రెబ్బలు-4
టమాటాలు-2
పచ్చిమిర్చి-2
కొత్తిమీర పొడి-2 టేబుల్ స్పూన్లు
పసుపు-3 టేబుల్ స్పూన్లు
గరమ్ మసాలా- 3/4 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి-1/2 టేబుల్ స్పూన్
కొబ్బరి పాలు-1 కప్పు
వెనిగర్ 1 టీ స్పూన్
ఆవాలు- 1/2 టీ స్పూను
నూనె- 4 టేబుల్ స్పూన్లు
కరివేపాకు రెబ్బలు-10
ఉప్పు- సరిపడా

తయారుచేసే విధానం

స్టౌపై ప్యాన్ పెట్టి వేడెక్కిన తర్వాత ఆవాలు, ఉల్లి తరుగు వేసి వేయించాలి. తర్వాత అల్లం, వెల్లుల్లి, ఉప్పు వేసి నాలుగు నిమిషాలు ఉడికించాలి. ఇప్పుడు కొత్తిమీర పొడి, పసుపు, కారం, గరం మసాల పొడి కూడా వేసి బాగా కలిపి మరికొంత సేపు ఉడికించాలి. అందులో టమాట తరుగు కూడా వేసి పది నిమిషాలు ఉడకనివ్వాలి. తర్వాత కొబ్బరి పాలను పోసి ఈ మిశ్రమం ఉడుకుతుండగా కరివేపాకు రెబ్బలు, శుభ్రంగా కడిగిన పీతల్ని వేసి మూత పెట్టి పదిహేను నిమిషాల పాటు ఉడికించుకోవాలి. అందులో మిరియాల పొడి, జీలకర్ర పొడి, వెనిగర్‌ని కూడా వేసి కలుపుకోవాలి. మరో ప్యాన్‌లో పోపు వేసి బాగా ఉడికించిన కూరలో కలిపి సర్వింగ్ బౌల్‌లోకి తీస్తే పీతల కూర రెడీ.



ఎగ్ థోర్న్

కావాల్సిన పదార్థాలు

నూనె- 4 టేబుల్ స్పూన్లు
ఆవాలు-1 టేబుల్ స్పూన్
ఉల్లితరుగు-1కప్పు
కొబ్బరి తురుము -1/2 కప్పు
పచ్చిమిర్చి-2
గుడ్లు- 4
పసుపు- చిటికెడు
కారం-2 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి రెబ్బలు-2
జీలకర్ర-1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా మిక్సీ జార్‌లో కొబ్బరి తురుము, ఉల్లి తరుగు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లో గుడ్డుసొన వేసి బాగా బీట్ చేసి పక్కన పెట్టుకోవాలి. స్టౌపై బాణలి పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత పోపు దినుసులు పచ్చిమిర్చి తరుగు, ఉల్లి తరుగు వేసి వేయించుకోవాలి. కొద్దిగా ఉప్పు, పసుపు కూడా వేసి అన్నీ కలిసేలా బాగా కలపాలి. బీట్‌చేసి పెట్టుకున్న గుడ్డు సొనని కూడా వేసి కొద్దిసేపు ఉడికించుకోవాలి. ఇప్పుడు కొద్దిగా మసాలా వేసి బాగా కలిపి రెండు నిమిషాలు ఉడికించిన తర్వాత స్టౌపై నుండి దించేయాలి.

కేరళ చేపల కూర

కావాల్సిన పదార్థాలు

చేపలు- 1/2 కేజీ
కొబ్బరి నూనె -4 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి రెబ్బలు-15
ఉల్లి తరుగు- 1/4 కప్పు
పచ్చిమిర్చి-2, అల్లం తరుగు- 2 టేబుల్ స్పూన్లు, కుడం పులి(నల్ల చింతపండు) - 4
కారం-4 టేబుల్ స్పూన్లు
పసుపు-1/4 టేబుల్ స్పూన్
మెంతులు-1/4 టేబుల్ స్పూన్
ఆవాలు-1/2 టేబుల్ స్పూన్
మిరియాల పొడి-1 టేబుల్ స్పూన్
నీరు- సరిపడ, జీలకర్ర పొడి- 1 టీ స్పూన్, కరివేపాకుల రెబ్బలు- 4
ఉప్పు-తగినంత

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్‌లో కొద్దిగా నీరు పోసి చింతపండును నానపెట్టుకోవాలి. చేపల్ని శుభ్రంగా కడిగి ముక్కలు తరిగి ఒక బౌల్‌లో పక్కన పెట్టుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత మెంతులు, ఆవాలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి తరుగు, ఉల్లి తరుగు కరివేపాకు రెబ్బలు కూడా వేసి వేయించుకోవాలి. తర్వాత పసుపు, మిరియాల పొడి, కారం వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో నానపెట్టిన నల్ల చింతపండు గుజ్జు, ఉప్పు, కొద్దిగా నీరు పోసి ఉడికించాలి. తర్వాత చేప ముక్కల్ని కూడా వేసి మరికొంతసేపు ఉడకనివ్వాలి. ముక్కలు ఉడుకుతుండగా మరికొన్ని కరివేపాకు రెబ్బలు, మెంతి పొడి వేసి పది నిమిషాలు ఉడికించి వేడి వేడిగా అతిథులకి సర్వ్ చేయండి.





పదాలు పూరించండి

ఇక్కడ ఏడు బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీల్లో నింపేయండే!



pl_m

r_ck

st_mp

s_nk

p_nt

_mbr_ll_

జ: plum, rock, stamp, sink, pant, umbrella

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక క్రికెట్ స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి ?

యువరాజ్ సింగ్



ఎన్నున్నాయి?

ఇక్కడ కనిపిస్తున్న మంచు కొండల్లో కొన్ని జంతువులు, పక్షులు దాగున్నాయి. అవెక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.



చుక్కలు కలపండి



దారి కనిపెట్టండి

ఇక్కడ కనిపిస్తున్న ఈ పక్షి తన గూటికి చేరే దారిని కనిపెట్టండి.

ఏ నీడ ఎవరిది

ఇక్కడ కొన్ని జంతువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



నీడతో బొమ్మ



పిల్లలూ మీకు పిల్లి బొమ్మంటే భలే ఇష్టం కదూ! చేతి వేళ్లతో పిల్లి బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం. చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.

బటన్ ఆర్ట్

పిల్లలూ! చాలా మంది ఇంటి గోడల్ని రకరకాల పెయింటింగ్స్, అల్లికలు, ఫొటో ఫ్రేమ్స్‌తో అలంకరిస్తుంటారు. అవి భలేగా ఉంటాయికదూ. అయితే మనింట్లో దొరికే వస్తువులతో అందమైన బొమ్మల ఫ్రేముల్ని మీరూ తయారుచేయచ్చు . ఎలా చేయాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా నేర్చుకోండే..

కావాల్సిన వస్తువులు

గుండీలు – అన్ని రంగులవి, కన్‌స్ట్రక్షన్ పేపర్/ క్యాన్వావాస్ పేపర్ (8X8), గమ్, కత్తెర, స్కెచ్ పెన్

తయారుచేసే విధానం

ముందుగా కన్‌స్ట్రక్షన్ పేపర్/ క్యాన్వావాస్ పేపర్‌ని కత్తెరతో చతురస్ర ఆకారంలో జాగ్రత్తగా కత్తిరించాలి. నాలుగు వైపులా పేపర్ చివర్లని సమానంగా వెనక్కి మడవాలి. తర్వాత బొమ్మలో చూపిన విధంగా స్కెచ్ పెన్‌తో గుడ్లగూబ బొమ్మని గీయాలి. ఇప్పుడు వేరు వేరు సైజుల్లో, రంగు రంగుల గుండీలు తీసుకుని మీరు గీసిన బొమ్మపై వాటిని అందంగా అంటించండి. పెద్ద గుండీలని కళ్ల భాగంలో అంటించాలి. అవి పూర్తిగా ఆరిన తర్వాత పేపర్ వెనుక భాగంలో మరో కన్‌స్ట్రక్షన్ పేపర్‌ని అతికించాలి. ఇలా మీకు నచ్చిన బొమ్మల్ని గీసి రంగు రంగుల గుండీలతో అలంకరించి గోడలకి తగిలిస్తే ఆ బొమ్మలు భలే అందంగా ఉంటాయి.



పదవికాసం - 25

కూర్పు: రావెళ్ల

1		2	3	✿	4	5		6
	✿	7		✿	8		✿	
9	10	✿	11	12		✿	13	
14		15	✿		✿	16		
✿	✿	17		✿	18		✿	✿
19	20		✿	21	✿	22	23	24
25		✿	26		27	✿	28	
	✿	29		✿	30	31	✿	
32				✿	33			

ఆధారాలు

అడ్డం

1. ప్రతిభ కనబరిచిన వారికిచ్చేవి (4)
4. అన్నీ కలిసి రావడం (4)
7. వర్షం (2)
8. దెస (2)
9. అటు నుండి గోవు (2)
11. అడివిబాపిరాజు రచన (3)
13. పిల్లల చెవికి కుట్టించేవి పోగుకాదు (2)
14. మర్రి చెట్టుకు వేళ్లాడేవి కుడి నుండి (3)
16. అన్నయ్య భార్య (3)
17. నక్షత్రం (2)
18. హిందీ 'కామ్' తెలుగుతో (2)
19. బోయీలు దేనిని మోస్తారు (3)
22. తలంచిలో సున్నా లోపం (3)
25. మగ్గం మీద తయారయ్యేది అటు నుండి(2)
26. సంతోషము (3)
28. వంకర లేనిది చివరలేదు(2)
29. చలి చీమ కాదు(2)
30. తీరము (2)
32. అటునుండి దివిటీలు (4)
33. మాజీ రాష్ట్రపతి వెంకట్రామన్ పూర్తిపేరులో తొలి సగం (4)

నిలువు

1. ఇవి ఎక్కువగా ఉంటే వర్షాలు పడతాయి (4)
2. ఆద్యంతాలు లేని అవార్డులు కింది నుండి (2)
3. కోనలు తిరగేసి రాయండి (3)
4. ఎంత ఎదిగినా గొప్పవారు ఇలా ఉంటారు(3)
5. దాక్కొను (2)
6. కింది నుండి సంచరించు (4)
10. అక్కడ క్లుప్తంగా(2)
12. 1966లో తాత్కాలిక ప్రధానిలోని చివరి రెండక్షరాలు (2)
13. ఒత్తులేని ఒక రకం వస్త్రం (2)
15. ఊరికి వెళ్ళులో చివరి రెండక్షరాలు మాయం (3)
16. మహిళ(3)
19. విజయవాడ, విశాఖ పల్లెటూళ్ళు కాదు (4)
20. కుర్చీ వంటిదే ఇద్దరు ముగ్గురు కూర్చోవచ్చు కింది నుండి (2)
21. ఒత్తులేని కథ (2)
23. లత తరగతిలో1,3 అక్షరాలు (2)
24. బెంగళూరులోని ఒక స్టేడియం (4)
26. తారుమారైన కాముడు (3)
27. మురళి,దమయంతి, రాము..లలో ప్రథమాక్షరాలు (3)

సుడోకు

	9	2	1					4
4	7	8	2		5			
	5					8		
2	6	7		1		4	9	
8				5				7
	3	5		4		6	8	1
		6					1	
			9		4	3	5	2
3					1	7	4	

గతవారం జవాబులు

1	2	3	4	5	6	8	9	7
8	7	4	9	1	2	3	6	5
6	9	5	7	3	8	4	2	1
9	3	6	5	8	1	7	4	2
2	8	1	6	4	7	5	3	9
4	5	7	2	9	3	1	8	6
3	4	2	1	6	5	9	7	8
7	1	9	8	2	4	6	5	3
5	6	8	3	7	9	2	1	4

1 వి	పి	2 న	3 ము	X	4 క	5 ల	వా	6 రి
న	X	7 గ	రి	X	8 న్న	అ	X	క్రే
9 య	10 మ	X	11 మి	12 ను	ము	X	13 సు	హా
14 ము	న	15 గ	X	పి	X	16 స	మ	స్తం
X	X	17 ల	జ్జ	X	18 నా	రి	X	X
19 రా	20 గ	ము	X	21 వా	X	22 గ	23 ర	24 మ
25 వ	యా	X	26 జా	త	27 ర	X	28 మా	ను
జా	X	29 కా	న	X	30 వ	31 ల	X	గు
32 ఘు	ము	ఘు	ల	X	33 ము	క్కి	లా	ట





తీగలతో కట్టిపడేసి...

లోహపు తీగలతో మనిషిని కట్టిపడేశాడు. అదే పనిగా చుట్టేస్తూ ప్రాణం పోశాడు. ఆ లోహపు తీగల శిల్పాల్ని చూసిన వారికి ఓ భ్రమ ఎదురైంది. లోపల మనిషున్నాడేమోనని తడిమి చూశారు. తట్టి పిలిచారు. ముఖం మీది మడతలు, కురుల వంకర్లు ప్రతీదీ తీగతో మెలిపెట్టేశాడు దక్షిణ కొరియాకు చెందిన కళాకారుడు సూయింగ్ మో పార్క్. కొన్ని లక్షల అల్యూమినియం తీగల చుట్టల్ని మలిచి ఓ మనిషిలా నిలబెట్టేస్తాడాయన.





కళ్లల్లోకి కళ్లు పెట్టి...

మీ ఇంట్లో బుడ్డది పాక్కుంటూ మీ ముఖం దగ్గరగా వచ్చి కళ్లలో కళ్లు పెట్టి లోతుగా చూస్తే ఎంత మురిసిపోతారు..! ఎంతమందికి ఆ అవకాశం దొరుకుతుంది. ఫిన్‌ల్యాండ్‌కు చెందిన 22 ఏళ్ల కుర్రాడు కోంస్టా పంక్కా ఈ విషయంలో చాలా అవకాశాలే కొట్టేశాడు. బుడతల్నే కాదు అతడు ఉడతల్ని మిగతా అడవి జంతువుల్నీ ఆకట్టుకుంటాడు. చిన్న అలికిడికే తుర్రున పారిపోయే ఉడతలు ఎటూ కదలకుండా అతడి కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తుంటాయి. కెమెరాతో వాటి దగ్గరి ముఖాల్ని చటుక్కున పట్టేస్తున్నా ఏ మాత్రం చలించవు. ఫిన్‌ల్యాండ్‌లోని అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ వన్యప్రాణుల చిత్రాల్ని తీస్తాడు కోంస్టా. ఒక్కో ప్రాంతంలో వారాల తరబడి గడిపేస్తూ అక్కడి జంతువులకు అలవాటవుతాడు. వాటి నమ్మకాన్ని పొంది తేలిగ్గా మచ్చిక చేసేస్తాడు. వేలి కదలికలతోనే తనకిష్టమైన విధంగా తలలు తిప్పేలా, శరీరాన్ని కదిలించేలా వాటిని నియంత్రించగలడు. నమ్మబుద్ధి కావడం లేదా మీరు దగ్గరగా వాటి కళ్లలోకి కళ్లు పెట్టి చూడండి.







Check List

Book Number	KNSR02B131	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29